సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి,
ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే
విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల
పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు,
ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన
ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికి
సమాధానం లేదు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

మంగళవారం 21.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 90 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- ప్రభుత్వపాఠశాలలను చూసి అసూయపడేలా చేస్తాం
- మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం
- ఇందుకు మీ ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలి

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలలను చూసి అసూయపడేలా చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని తల్లికి వందనం పథకం లబ్ధిదారులైన విద్యార్థుల తల్లులతో మంగళగిరి బైపాస్ కొండపనేని టౌన్ షిప్ పార్క్‌లో మంత్రి లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం అందుతున్న తీరు, తల్లికి వందనం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఏ విధంగా ఉపయోగపడుతోందనే విషయాలపై మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం** : ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషిచేస్తున్నాం. గతంలో ప్రైవేటు పాఠశాలలను చూసి అసూయపడేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను చూసి ప్రైవేటు పాఠశాలలు అసూయపడేలా చేస్తాం. నిడమర్రు పాఠశాలలో ప్రవేశాల కోసం విపరీతమైన పోటీ ఉంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో లీప్ పాఠశాలలను తీర్చిదిద్దుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే కారణం విద్య. సమాజంలో మార్పునకు, రాష్ట్ర అభివృద్ధికి విద్యే ప్రధానం. ప్రజాప్రభుత్వంలో 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది మరో 3వేల పోస్టులు భర్తీ చేస్తాం. పదివేలకు పైగా పాఠశాలల్లో వన్ క్లాస్-వన్ టీచర్ విధానం తీసుకువచ్చాం. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 1,06,000 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు తరలివచ్చారని మంత్రి అన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఆరా** : ప్రభుత్వ పాఠశాలల పనితీరు, బోధన గురించి మహిళలను మంత్రి ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం అందరికీ అందుతుందా అని ఆరా తీశారు. అందరికీ తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందిందని మహిళలు వివరించారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా అందరితో పాటు లబ్ధి చేకూర్చేలా తల్లికి వందనం పథకం జులైలో అమలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీలోగా ఆర్థిక సాయం నిధులు తల్లుల ఖాతాల్లో జమఅవుతాయని వివరించారు. యువగళం పాదయాత్ర సమయంలో విద్యలో కర్నూలు వెనుకబడి ఉండటాన్ని గమనించానని, ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం అందించాలని అప్పుడే సంకల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు మగ పిల్లలకు కూడా బ్యాడ్ టచ్ గురించి తరగతి గదిలో బోధించాలని, విద్యాసంవత్సరం పూర్తైన తర్వాత పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లు నిర్వహించాలని కోరారు. ఇందుకు చర్యలు తీసుకుంటామని, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లకు లైబ్రరీలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. తల్లికి వందనం పథకం కింద అందే ఆర్థికసాయాన్ని పిల్లల భవిష్యత్ అవసరాల

మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో

**మంత్రి లోకేష్ ముఖాముఖి**

2 లో..



## టూర్ గైడ్లుగా ఏపీ యువత



- అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణకు అడుగులు
- పర్యాటక సేవల్లో ఏఐతో పాటు మానవ గైడ్స్‌కూ ప్రాధాన్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్.. టూరిస్ట్ గైడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మిగతా 2లో...

## పీపీపీని ప్రశ్నించే హక్కు వైసీపీకి లేదు



- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రామాయపట్నం పోర్టును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడాన్ని ప్రశ్నించే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీకి లేదని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పీపీపీ విధానాన్ని ఎప్పుడైనా వ్యతిరేకించారా అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను ప్రైవేట్ సంస్థకు విక్రయించినప్పుడు, పారదర్శకత లేకుండా రెండు బెర్తులను

మిగతా 2లో...


## రిజిస్ట్రేషన్ సేవల్లో కొత్త విధానం

- ప్రైవేటీకరణ కాదని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రజలకు మెరుగైన సేవలు.. డాక్యుమెంట్ రైటర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని... దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

**సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు** : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-RSKలను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్ పోర్టు సేవా కేంద్రాల

మిగతా 2లో...



### గిరిజనులకే తొలి ప్రాధాన్యం

- జీవో-3పై ప్రత్యామ్నాయాల అన్వేషణ..
- గిరిజన సంఘాలతో త్వరలో చర్చలు
- స్థానిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం

2 లో..



### ప్రతి బాలింతకు భద్రమైన ప్రయాణం

- 'తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్'గా 500 కొత్త వాహనాలు
- సీఎం చంద్రబాబు పరిశీలన.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సేవలు

2 లో..




## కేంద్రం దృష్టికి రాష్ట్ర సమస్యలు



- చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీలో రాష్ట్ర మంత్రుల బృందం
- పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో ప్రత్యేక సమావేశాలు

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధుల బృందం నేడు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను విడివిడిగా కలుసుకుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై ఈ సందర్భంగా చర్చించి, వినతిపత్రాలను అందజేశారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆయన నివాసంలో రాష్ట్ర మంత్రుల బృందం సమావేశమైంది.

అమరావతిలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయడంపై ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఢిల్లీలోని 'వాణిజ్య భవన్'లో రాష్ట్ర మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు, ఎగుమతిదారుల సమస్యలను

మిగతా 2లో...

ఆక్వా బతికితేనే..

## రైతుకు భరోసా



- సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి
- ఫిష్‌మీల్ ఎగుమతుల నియంత్రణ కోరిన సీఎం
- పొగాకు రంగానికి పన్ను రాయితీలు, ఎగుమతి ప్రోత్సాహకాలపై కేంద్రానికి వినతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు.

మిగతా 2లో...

## హజ్ దరఖాస్తులకు గడువు పెంపు

- 24వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం
- గన్నవరం నుంచి వెళ్లేవారికి రూ. లక్ష ప్రభుత్వ సాయం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు కేంద్ర హజ్ కమిటీ గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. కేంద్ర హజ్ కమిటీ పెంచిన నాలుగు రోజుల గడువును హాజీలు సద్వినియోగం చేసుకోవాలని సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ కోరారు. హజ్ -2027 కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీ వరకు కేంద్ర హజ్ కమిటీ గడువును నిర్ణయించిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆన్ లైన్ దరఖాస్తుల ను పంపేందుకు గడువును మరో నాలుగు రోజులు పెంచుతూ కేంద్ర హజ్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తులు సమర్పించని వారు కేంద్ర హజ్ కమిటీ పెంచిన గడువు వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. గడువుకు ముందుగానే ఆన్ లైన్ ద్వారా హాజీ లు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ తరువాత గడువు పొడిగించబడదని మంత్రి ఫరూక్ సూచించారు.

**విజయవాడ ఎంబార్కేషన్ న్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి** : హజ్ -2027 యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్ కు చెందిన హాజీలు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఫరూక్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ కి వెళ్లే ప్రతి ప్రయాణికునికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని

మిగతా 2లో...

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

కోసం ఆదా చేస్తున్నట్లు మహిళలు వివరించారు.

**మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి :** విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు గారితో నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి విద్యార్థులకు అందజేశాం. మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి. మహిళలను అందరూ గౌరవించాలి. టెక్నాలజీ వల్ల మంచీ, చెడూ రెండూ ఉంటాయి. మనం ఏది ఎంచుకున్నామనేది ముఖ్యం. ప్రతి కుటుంబం ఏఐ వినియోగించి నేర్చుకోవాలనేది సీఎం చంద్రబాబు గారి ఆలోచన.

**మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం :** మంగళగిరిలో 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరాను. ప్రజలు 91వేల భారీ మెజార్టీతో నన్ను గెలిపించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే మొదటి విడతలో 3వేల ఇళ్ల పట్టాలు అందజేశాం. రెండో విడతలో మరో 3 వేల పట్టాలు అందిస్తున్నాం. నియోజకవర్గంలో పదివేల ఇళ్లు నిర్మిస్తాం అని లోకేష్ పేర్కొన్నారు.

## టూర్ గైడ్లుగా ఏపీ యువత

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు విశేష ప్రాధాన్యం కల్పించిందని.. అందులో భాగంగా పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10,000 మంది యువతకు టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఆల్ ఇండియా టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి వారిని ప్రొఫెషనల్ టూర్ గైడ్స్‌గా తీర్చిదిద్దాలని మంత్రి దుర్గేష్ ఆయనను కోరారు. తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పర్యాటక సేవలను మెరుగుపరచడంతో పాటు, స్థానికంగా పర్యాటక రంగంలో వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం , వారికి శిక్షణను అందించేందుకు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని ఫెడరేషన్ ప్రతినిధులను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. పర్యాటక ప్రాంతాలలో సందర్శకులకు మెరుగైన సేవలందించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన 'ఏఐ డిజిటల్ గైడ్స్'తో పాటు, శిక్షణ పొందిన గైడ్స్ కూడా అందుబాటులో ఉంటారని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటకులు తమ పర్యటనల్లో వ్యక్తిగత గైడ్స్ కావాలని కోరుకుంటే ఈ శిక్షణ పొందిన యువత ఎంతగానో దోహదపడతారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో పర్యాటక రంగం ద్వారా రాష్ట్రంలోయువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యటనలో మంత్రి దుర్గేష్ తో పాటు ఏపీ పర్యాటక స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉన్నారు.

## పీపీపీని ప్రశ్నించే హక్కు వైసీపీకి లేదు

(మొదటి పేజీ తరువాయి)

జేఎస్‌డబ్ల్యూకు అప్పగించినప్పుడు ప్రజా ప్రయోజనాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. రామాయపట్నం పోర్టుపై వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామాయపట్నం పోర్టును అమ్మేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంలో రూ. 1,500 కోట్ల ముందస్తు ప్రీమియం, రాబడి భాగస్వామ్యం, కనీస గ్యారెంటీ ఆదాయం, ప్రభుత్వానికి 12 శాతం తగ్గని ఈక్విటీ వాటా వంటి నిబంధనలు పొందుపరిచామని తెలిపారు. పోర్టు యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వానివేనని, ఇది భూముల విక్రయం కాదని, దీర్ఘకాలిక అభివృద్ధి భాగస్వామ్య ఒప్పందమని వివరించారు.

వైసీపీ హయాంలో రామాయపట్నం పోర్టు పనులు 95 శాతం పూర్తయ్యాయన్న ప్రచారం వాస్తవం కాదని మంత్రి పేర్కొన్నారు. జూన్ 2024 నాటికి పనులు కేవలం 50 శాతం మాత్రమే పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటిని వేగవంతం చేసి ప్రస్తుతం 80.50 శాతం వరకు పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలిన భూసేకరణను కూడా పూర్తి చేశామని, గత రెండేళ్లలోనే సుమారు 30 శాతం అదనపు పురోగతి సాధించామని వెల్లడించారు.

పీపీపీ అంటే పోర్టులను అమ్మేయడం కాదని, అభివృద్ధి భాగస్వామ్య విధానమని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలోని 119 పోర్టుల్లో 108 పోర్టులు, అంటే సుమారు 91 శాతం పీపీపీ విధానంలోనే నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం పోర్టులు దాదాపు 29 ఏళ్లుగా ఇదే విధానంలో విజయవంతంగా పనిచేస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులకు రూ. 50 వేల కోట్లకు పైగా పెట్టుబడులు అవసరమని, పీపీపీ విధానం ద్వారా భారీ పెట్టుబడులు, ప్రభుత్వానికి ఆదాయం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి, రాష్ట్రం మారిటైమ్ హబ్‌గా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సాయికృష్ణ నివాసానికి సిట్.. తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్ రికార్డ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గాదె సాయికృష్ణ లాకప్ డెత్‌కు గురైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయికృష్ణ ఇంటికి వెళ్లారు. తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సాయికృష్ణ లాకప్ డెత్‌కు కారణాలు ఏంటనే కోణంలో ఆరా తీశారు.

**హైకోర్టులో పిటిషన్ వివరాలపైనా ఆరా :** హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ వివరాలపై అడిగి తెలుసుకున్నారు. సీఐ నాగరాజు, కృష్ణలంక పోలీసులపై చేసిన ఆరోపణలపై ఆధారాలుంటే ఇవ్వాలని కోరారు. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చిన టాస్క్ ఫోర్స్ పోలీసుల ప్రమేయంపైనా అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తనకు తెలిసిన అన్ని వివరాలతో పాటు అనుమానితులపైనా అధికారులకు విజయలక్ష్మి తెలిపారు. దీంతో ఆమె చెప్పిన అన్ని వివరాలను స్టేట్ మెంట్ రూపంలో నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తుపై అధికారులు దృష్టి పెట్టారు.

# గిరిజనులకే తొలి ప్రాధాన్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని... ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోకవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం." అని అన్నారు.

**త్వరలో గిరిజన సంఘాలతో చర్చలు :** స్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి...ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు...ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. గత పాలకులు తమ అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని....ఈ విషయంలో ఎవరి ట్రాప్ లోనూ పడవద్దని సిఎం సూచించారు. అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని... ఇదే విషయాన్ని గిరిజన సంఘాలకు చెప్పాలని సిఎం సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా...గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయి అభివృద్ధి జరిగినప్పుడే...వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతోందన్నారు. గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సిఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించనున్నారు. సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆక్వా బతికితేనే.. రైతుకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా , యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కుంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

**బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వండి :** ఆంధ్రప్రదేశ్ లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్‌షాప్ లో అమరావతిలో ఎన్ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

**డీజీఎఫ్‌టీ ద్వారా క్రమబద్ధీకరించండి :**

ఆంధ్రప్రదేశ్ లోని అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమతులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

**నిర్యాత్ ప్రోత్సాహన్ పథకం వర్తింప చేయాలి :** ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సీఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని సీఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సీవీ పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సీఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు =శీఱఖజూ పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం కోరారు.

**కిసాన్ క్రెడిట్ కార్డు పై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి :**

ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. కేంద్ర మంత్రికి లేఖ రాసిన సీఎం భారత– అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10 శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థిక శాఖ జోక్యం చేసుకోవాలని సీఎం కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు పై రూ. 5 లక్షల వంకూ వన్ టైమ్ టాప్ అప్ ఇవ్వాలని సీఎం కేంద్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కెటింగ్ కోసం ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ. 100 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు రొయ్య ఎగుమతులను పెంచేలా సబ్సిడీలు ఇవ్వటంతో పాటు సామర్థ్యాలను పెంచేలా చూడాలని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. అలాగే ప్రాసెస్ చేయని పొగాకు హెచ్ఎస్ఎన్ కోడ్ 2401 పై జీఎస్టీని 40 నుంచి 28 శాతానికి తగ్గించాలని సీఎం కోరారు. ఏపీలోని లక్షలాది మంది పొగాకు రైతులతో పాటు డీలర్లు, ఎక్స్ పోర్టర్లకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ పెంపు వల్ల వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు తలెత్తి సకాలంలో రైతులకు చెల్లింపులు చేయటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా ఆర్థిక లావాదేవీలు మెరుగవుతాయని సీఎం స్పష్టం చేశారు.

# కేంద్రం దృష్టికి రాష్ట్ర సమస్యలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

వాణిజ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆక్వాకల్చర్ రంగం సమస్యలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కార్మికులు, హేచరీలు, ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోవడం, ఉత్పత్తి వ్యయం (ముఖ్యంగా ఫీడ్ ధరలు) భారీగా పెరగడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రెండు కీలక విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అందులో భాగంగా, ఫిష్ మీల్ ఎగుమతులను నియంత్రించి దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఫీడ్ తయారీ వ్యయం తగ్గించి రైతులకు ఉపశమనం కలిగించాలని కోరారు. అలాగే, నమోదు చేసుకున్న రొయ్యల ఫీడ్ తయారీ సంస్థలకు మాత్రమే పరిమిత స్థాయిలో, 2021 నాటి విధానాన్ని అనుసరించి తగిన నియంత్రణలతో జన్యుమార్పిడి సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల ఫీడ్ తయారీ ఖర్చు తగ్గి, రైతుల ఆదాయం మెరుగుపడటంతో పాటు భారత రొయ్యల ఎగుమతుల పోటీతత్వం, విదేశీ మారకద్రవ్య ఆదాయం, లక్షలాది కుటుంబాల జీవనోపాధి రక్షించబడుతుందని మంత్రులు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నివాసంలో జరిగిన భేటీలో అమరావతిలో చీఖీణదీ ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ ఏర్పాటు గురించి చర్చించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన ఎగుమతుల వాణిజ్య సదస్సులో కేంద్ర మంత్రి గారు దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జీవో నెం. 146 ద్వారా అమరావతి సమీపంలో 7.89 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. ఖూ= తయారీ, పరిశీలనలు, ఆర్థిక అనుమతులు, నిధుల విడుదల , టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 2028 నాటికి ఈ కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ కేంద్రాల ఏర్పాటు వల్ల చీఖీణదీ ప్రాంతీయ కార్యాలయం, ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ, శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చి ప్రజలకు, ఆక్వా రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నమ్మకమైన బ్రూడ్ స్టాక్ తయారీ సంస్థల విస్తరణకు, క్వారంటైన్ నిబంధనల సడలింపునకు తగిన చర్యలు తీసుకోవాలని, 2021 నాటి భద్రతా నిబంధనలను అనుసరించి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వాణిజ్య భవన్ సమావేశంలో పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు అందించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గారికి వినతిపత్రం సమర్పించారు. భారతదేశ ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, ఈ రంగంపై లక్షలాది మంది రైతులు, కూలీలు ఆధారపడి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం పొగాకు ఎగుమతిదారులకు తగిన ప్రోత్సాహకాలు అందకపోవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో గట్టి పోటీని ఎదుర్కొంటున్నారని మంత్రులు వివరించారు. ఈ నేపథ్యంలో, HS Code 2401 (2401 10, 2401 20, 2401 30) కింద ఉన్న అన్‌మాన్యుఫ్యాక్చర్డ్ పొగాకుకు =శీఱఖజూ పథకాన్ని వర్తింపజేయాలని, అలాగే Interest Equalisation Scheme పరిధిలోకి కూడా దీనిని తీసుకురావాలని తెలిపారు. భారత్ నుండి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులు 2021–22లో 105.21 మిలియన్ కిలోల (విలువ రూ. 2,909.99 కోట్లు) నుండి 2025–26 నాటికి 155.05 మిలియన్ కిలోలకు (విలువ రూ. 7,782.98 కోట్లు) పెరిగాయని, ఇది భారత పొగాకు నాణ్యతకు నిదర్శనమని వివరించారు. జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాలు తమ ఎగుమతిదారులకు భారీగా ఆర్థిక ప్రోత్సాహకాలు ఇస్తున్నందున, భారత పొగాకు ఎగుమతిదారులు అంతర్జాతీయ పోటీలో నిలబడటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల, పొగాకు రైతుల సంక్షేమం, ఆయా రంగాల స్థిరాభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని, కేంద్ర మంత్రులు ఈ అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రుల బృందం వెల్లడించింది.

## రిజిస్ట్రేషన్ సేవల్లో కొత్త విధానం



(మొదటి పేజీ తరువాయి)

తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయి. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో... ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించండి. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. అలాగే డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం–2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్దతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ–ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలి"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**లిటిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్ :** "లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలి. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలి. డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించండి. ఇదే సమయంలో వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలి. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలి. పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు... ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి బాలింతకు భద్రమైన ప్రయాణం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జూలై 20:–లి రాష్ట్రంలో మాతా–శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం... గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా 'తల్లి––బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, తల్లి––శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

**అందుబాటులోకి 500 వాహనాలు :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక ాఖఎ/వీఖఎ వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ :** వాహనాల్లో తల్లీ–శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) అధికారులు పాల్గొన్నారు.

## హజ్ దరఖాస్తులకు గడువు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. హజ్–2026 కు విజయవాడ కేంద్రం నుంచి బయలుదేరి, విజయవంతంగా యాత్ర పూర్తి చేసి వచ్చిన 331 మంది హాజీలకు రూ. 3.31కోట్లు ప్రభుత్వం నేరుగా వారి అకౌంట్లకు రూ. లక్ష చొప్పున జమ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కాగా పవిత్ర మక్కా హజ్ యాత్ర లో కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించిందని, తక్కువ రోజుల వ్యవధి తో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆ ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 35–45 రోజుల వ్యవధితో చేసే హజ్ యాత్ర ప్యాకేజ్, 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు. 2027 – హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి షార్ట్ హజ్ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు.

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి లోకేష్ శాశ్వత పరిష్కారం

- మంగళగిరి నియోజకవర్గంలో రెండో విడతలో సుమారు 3 వేల మందికి పట్టాలు సిద్ధం
- 21,22 తేదీల్లో 'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమం ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల సమయంలో ఓట్లకోసం అలవికాని వాగ్దానాలు చేసి, అవసరం తీరాక మొఖం చాటేసే సాంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా... మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకునేందుకు మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారు. దశాబ్దాలుగా మంగళగిరి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న సుమారు 3వేల మందికి ఈనెల 21,22తేదీల్లో మన ఇల్లు – మన లోకేష్ పేరిట రెండో విడత శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మంగళగిరి డీజీపీ ఆఫీసు సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో రెండో విడత పట్టాలు పంపిణీ చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది మంది ప్రజలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటూ వస్తున్నారు. అయితే వారికి సంబంధిత భూములపై ఎటువంటి అధికారిక హక్కులు ఇప్పటివరకు లేవు. దీంతో సంబంధిత స్థలాలను తమ వారసులకు ఇవ్వాలన్నా, అత్యవసర సమయాల్లో రుణాలు తీసుకోవాలన్నా సాధ్యంకాని పరిస్థితులు నెలకొన్నాయి. మంగళగిరి ప్రజలు ఎదుర్కొంటున్న ఈ జఠిలమైన సమస్యను ఎన్నికలకు ముందు ప్రత్యక్షంగా చూసిన యువనేత లోకేష్... తాము అధికారంలోకి వస్తే ఈ మొండి సమస్యకు పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 2025 ఏప్రిల్ నెలలో మంగళగిరి రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న 3002మందికి నూతన వస్త్రాలు పెట్టి మరీ పట్టాలు పంపిణీ చేశారు. సుమారు రూ. 1,000 కోట్ల విలువైన భూములను ఒక్కరూపాయి ఖర్చులేకుండా అర్హులైన పేదలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేశారు.

**మలివిడత అందించే శాశ్వత పట్టాల వివరాలు :** మలివిడత పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో సుమారు 3వేల మందికి శాశ్వత పట్టాలు, ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్స్ ను మంత్రి లోకేష్ చేతులమీదుగా పంపిణీ చేయనున్నారు. రెండోవిడతలో పంపిణీ చేయబోతున్న పట్టాల విలువ ప్రస్తుత ఓపెన్ మార్కెట్ ప్రకారం సుమారు వెయ్యి కోట్లుగా ఉంది. మంగళగిరి గ్రామంలోని సర్వే నంబర్లు 232/1దీ1ూ, 232/1దీ1దీ, 232/1దీ1జలలో 92.12 ఎకరాలు, నవులూరు గ్రామంలోని సర్వే నంబర్ 115లో 8.46 ఎకరాల భూములు సెక్షన్ 22ూ(1)(ఖ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నాయి. దీనివల్ల 1,622 నివాస గృహాలు ప్రభావితమై, దీర్ఘకాలంగా ఆస్తి రిజిస్ట్రేషన్‌పై ఆంక్షలు విధించబడ్డాయి. ఫలితంగా బదిలీ, వారసత్వం, సంక్రమణ వంటి చట్టబద్ధమైన లావాదేవీలకు ఇప్పటివరకు అవకాశం లేకుండా పోయింది. ఈ స్థలాలపై నిషేధాన్ని తొలగిస్తూ ఆర్డీవో ద్వారా ధృవీకరించిన ప్రాపర్టీ ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్లను మంత్రి లోకేష్ అందజేయనున్నారు.

**స్టీల్ బ్రిడ్జ్ పట్టాలు :** అమరావతి రాజధాని నగర ప్రాజెక్టులో భాగంగా బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి, మంగళగిరిలోని కె.ఎల్. రావు కాలనీలో ఆక్రమణదారులుగా ఉన్న మొత్తం 81 మందిని గుర్తించారు. ప్రభావితమైన ఈ ఆక్రమణదారులకు పునరావాసం కల్పించేందుకు, ఆత్మకూరు లేఅవుట్‌లో 34 ప్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయించారు. పంపిణీకి ప్రతిపాదించిన మొత్తం 81 స్టీల్ బ్రిడ్జ్ పట్టాలలో తాడేపల్లి మండలంలో 47, మంగళగిరి మండలంలో 34 కేసులు ఉన్నాయి. G.O.Ms.No.30 నిబంధనల ప్రకారం, మొత్తం 906క్రమబద్ధీకరణ పట్టాలను (150 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణం కలిగినవి) పంపిణీ చేయడానికి ప్రతిపాదించారు. వీటిలో 630 పట్టాలు తాడేపల్లి మండలానికి చెందినవి కాగా, 276 పట్టాలు మంగళగిరి మండలానికి సంబంధించినవి.

## వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర



- రథాన్ని లాగిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం (జర్నలిస్ట్ ఫైల్):ధర్మవరంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఉత్సవంలో పాల్గొని శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ బలరాముడు, శ్రీ సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ భక్తులతో కలిసి రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ స్వామివారి కరుణాకటాక్షాలు ధర్మవరం ప్రజలతో పాటు రాష్ట్ర, దేశ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో ఇస్కాన్ సంస్థ విశేష కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం, పేదలకు సేవా కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు చేపడుతూ సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న ఇస్కాన్ సేవలు అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, మానవతా విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరినామ సంకీర్తనలు, భజనలతో ధర్మవరం పట్టణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. శ్రావణబాబుకు హంసా ప్రతినిధుల శుభాకాంక్షలు



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): ఎన్టీఆర్ జిల్లా నూతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమితులైన డాక్టర్ ఏ. శ్రావణబాబును ఏపీ హంసా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ హంసా రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్, కోశాధికారి వై. శ్రీనివాస్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు వినుకొల్లు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బి. రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. లక్ష్మోజి, అసోసియేట్ ప్రెసిడెంట్ బి. రోషిబాబు, జాయింట్ సెక్రటరీ సీహెచ్. పిచేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి కేబీసీ శేఖర్, జాయింట్ సెక్రటరీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఈసీ సభ్యుడు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్యతో పనతల సురేష్ భేటీ



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జనతా పార్టీ జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్యను ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ సోమవారం న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, పార్టీ విస్తరణకు చేపట్టిన రాజకీయ కార్యక్రమాల గురించి లాల్ సింగ్ ఆర్యకు పనతల సురేష్ వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ మోర్చా నిర్వహించిన కార్యక్రమాలకు లభిస్తున్న ప్రజాదరణను కూడా ఆయన వివరించినట్లు తెలిపారు.

అలాగే రానున్న రోజుల్లో దళిత సంక్షేమం, సామాజిక సాధికారత, పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టనున్న కార్యాచరణపై ఇద్దరు నేతలు చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు దళిత వర్గాల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించినట్లు సమాచారం.

## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నల్లపల్లి విజయ్ భాస్కర్



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్): సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ శాఖ కేంద్ర సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలేను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులను నిరోధించే ప్రత్యేక చట్టం తీసుకురావడం తదితర అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు నల్లపల్లి విజయ్ భాస్కర్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్రం సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

## పరిశ్రమలను తరిమేయడంలో జగన్ దేశంలోనే నంబర్-1: అప్పసాని రాజేష్

- పెట్టుబడుల అనుకూలత నివేదికపై సాక్షి దుష్ప్రచారం
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను తరిమేయడంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే నంబర్–1గా నిలిచారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ విమర్శించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ నివేదికను వక్రీకరిస్తూ సాక్షి పత్రిక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీకి, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ నివేదికకు తేడా కూడా తెలియకుండా తప్పుడు కథనాలు ప్రచురించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

జగన్ పాలనలో కొత్త పరిశ్రమలు తీసుకురావడం పక్కన పెడితే, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను కూడా వెళ్లిపోయే పరిస్థితి కల్పించారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దు, పరిశ్రమలపై ఒత్తిళ్లు వంటి నిర్ణయాలతో రాష్ట్రంపై పెట్టుబడిదారుల్లో అపనమ్మకం పెరిగిందన్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 39,450 పరిశ్రమలు గ్రౌండింగ్ కాగా, 5.13 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి శాసనమండలిలో వెల్లడించిన అధికారిక గణాంకాలే దీనికి నిదర్శనమని చెప్పారు.

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన పెట్టుబడి ప్రతిపాదనల్లో 25.3 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కిందని, ఇప్పటివరకు జరిగిన 19 రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశాల్లో సుమారు రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని తెలిపారు. భూకేటాయింపులు, మౌలిక వసతులు, అనుమతులను వేగంగా అందిస్తూ ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తోందని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కు ఫాస్ట్ మూవర్స్ విభాగంలో చోటు దక్కడం రాష్ట్రం వేగంగా పారిశ్రామికాభివృద్ధి సాధిస్తోందనడానికి నిదర్శనమని అప్పసాని రాజేష్ అన్నారు. రెండు వేర్వేరు నివేదికలను కలిపి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అసత్య ప్రచారాలతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోలేరని, జగన్ తన పాలనలో వచ్చిన పెట్టుబడులు, స్థాపించిన పరిశ్రమలు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సి.ఆర్. మీడియా అకాడమీ... డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యంతో సి.ఆర్. మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సును ప్రారంభించనున్నట్లు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. ఈ కోర్సు నిర్వహణపై చర్చించేందుకు సోమవారం నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావుతో సమావేశమయ్యారు. ప్రస్తుతం జర్నలిస్టులుగా పనిచేస్తున్నా వృత్తిపరమైన విద్య లేని వారికి ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని, ఇంటర్ ఉత్తీర్ణులైన జర్నలిస్టులు, జర్నలిజం రంగంలోకి రావాలనుకునే డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

ఈ కోర్సు కోసం ఇప్పటికే బోర్డు ఆఫ్ స్టడీస్‌ను ఏర్పాటు చేసి సిలబస్, పరీక్షల నమూనాను రూపొందించినట్లు ఆలపాటి సురేశ్ కుమార్ వెల్లడించారు. ఈ నెలాఖరులోగా ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని, సీనియర్ అధ్యాపకుల ద్వారా ప్రతిరోజూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి జర్నలిజంలో అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు అందిస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ డిప్లొమా కోర్సుకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల, సర్టిఫికెట్ల ప్రదానం వంటి బాధ్యతలను యూనివర్సిటీ చేపడుతుందని తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్ కోఆర్డినేటర్‌గా జర్నలిజం విభాగాధిపతి డా. కె. జ్యోతిర్మయిని నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏ. వెంకటేశ్వర్లు, సి.ఆర్. మీడియా అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లస్కర్ల నియామకం జరిగేనా



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): తెలుగు గంగా పథకంలో అంతర్భాగమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర రిజర్వాయర్ కింద అవసరమైన లష్కర్ల నియామకం జరిగేది ఎన్నడూ అని ఈ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు లక్ష 35 వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. సుమారు 17.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం జరిగింది కుడి ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు పొలాలకు వెళ్లే నీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా నీటిపారుదల శాఖ అధికారులు లస్కర్లను నియమించాల్సి ఉంది ఆయకట్టు రైతులకు సాగునీరు సరఫరా చేయడంతో పాటు కాలువల్లో ఉన్న కంప చెట్లను తొలగించడం తూముల నుంచి అవసరమైనన్ని నీళ్లను పొలాలకు సరఫరా చేయడం పనిలో భాగం. హెచ్‌ఆర్ వర్కర్ల ద్వారా ఈ పనులు గతంలో చేయించుకునేవారు. 40 మంది హెచ్ ఆర్ వర్కర్లు ఈ పనులను చేసేవారు.

ప్రస్తుతం హెచ్‌ఆర్ వర్కర్లు 212 జీవో ప్రకారం రెగ్యులర్ కాగా మరికొందరు రిటైర్డ్ అయ్యారు. దీంతో రిజర్వాయర్ కింద ఒక్క హెచ్ ఆర్ వర్కర్ కూడా లేకపోవడం విశేషం ప్రస్తుతం హెచ్ ఆర్ వర్కర్ల పని కూడా సంబంధిత అధికారులే చేయాల్సి వస్తుంది. రిజర్వాయర్ కు సంబంధించి సుమారు 30 నుంచి 40 మంది అవసరం ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం విచారకరం. లస్కర్ల నియామకం జరపాలని అందుకు సంబంధించిన అనుమతులు ఇవ్వాల్సిందిగా బ్రహ్మం సాగర్ కు సంబంధించిన అధికారులు కడప నీటిపారుదల శాఖ అధికారులను కోరుతూ లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు ఆ మేరకు నీటిపారుల శాఖ అధికారులు ఇ ఎన్ సి కి ఫైలు పంపారు. అయినప్పటికీ ఇ ఎన్ సీ నుంచి తగిన ఉత్తర్వులు రాకపోగా కాలవల నిర్వహణ కష్టతరంగా మారింది. 21.7.2026 వ తేదీన స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో పాటు రిజర్వాయర్ కు సంబంధించిన టిజిపి అధికారులు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయనున్నారు ఇది సంతోషదాయకమే అయినప్పటికీ ఈ నీరు వృధా కాకుండా ఆయకట్టు రైతులకు సక్రమంగా వెళ్లాలంటే లస్కర్ల వ్యవస్థ చాలా అవసరం. మరి ఎమ్మెల్యే గారైన చొరవ చూపి లస్కర్ల నియామకానికి అనుమతులు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సుమారు 40 మంది నిరుద్యోగులకు తన సొంత మండలంలో ఉపాధి కలగడమే కాకుండా నిరుద్యోగ సమస్య తీరుతుంది. రిజర్వాయర్ కుడి ఎడమ కాలువల ద్వారా వెళ్లే నీరు వృధా కాకుండా ఉండే అవకాశం ఉంది. మరి ఈ ముఖ్యమైన సమస్యను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఎలా పరిష్కరిస్తారో వేచి చూద్దాం?

## మారుపూడి మీనాక్షి మృతికి నివాళి



అమృతలూరు (జర్నలిస్ట్ ఫైల్): అమృతలూరు మండలం కూచిపూడి గ్రామానికి చెందిన అమృతలూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు మారుపూడి ఆనంద్ తల్లి మారుపూడి మీనాక్షి (62) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వారి నివాసానికి వెళ్లి మీనాక్షి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మారుపూడి ఆనంద్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన నక్కా ఆనందబాబు, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 17 అలైడ్ హెల్త్ కోర్సులకు శ్రీకారం

- 2026-27 విద్యా సంవత్సరం నుంచి దశలవారీగా అమలు
- జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆరోగ్య సేవల నిపుణుల తయారీకి చర్యలు
- డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గౌరవ వైస్-చాన్సలర్ డా. పులాల చంద్రశేఖర్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో అలైడ్ హెల్త్ విద్యను మరింత బలోపేతం చేసి, నైపుణ్యం కలిగిన ఆరోగ్య సేవల నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో 2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జాతీయ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కమిషన్ గుర్తింపు పొందిన 17 అలైడ్ హెల్త్ కోర్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రతిపాదనపై డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గౌరవ వైస్–చాన్సలర్ డా. పులాల చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, కొత్త కోర్సుల ప్రారంభంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అలైడ్ హెల్త్ కోర్సులను కూడా చీజూాూ నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు, అకాడెమిక్ ప్రమాణాలతో బలోపేతం చేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా వైస్–చాన్సలర్ డా. పులాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన ఆరోగ్య సేవల నిపుణులను తయారు చేయడంలో విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. దశలవారీగా ఈ కోర్సులను అమలు చేయడం ద్వారా అలైడ్ హెల్త్ విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మాట్లాడుతూ, ప్రతిపాదిత కోర్సుల అమలుకు విశ్వవిద్యాలయం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ప్రభుత్వ వైద్య కళాశాలలతో సమన్వయం చేసి నిర్ణీత సమయంలో కోర్సులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డైరెక్టర్ డా. సూర్యప్రభ అలైడ్ హెల్త్ విద్యలో పరిశోధన, ఆవిష్కరణలు, సాక్ష్యాధారిత బోధన, విభాగాల మధ్య సమన్వయం అవసరాన్ని వివరించారు.

జాయింట్ రిజిస్ట్రార్ (అకాడెమిక్) డా. నీలిమ కోర్సుల అమలుకు సంబంధించిన అకాడెమిక్ కార్యాచరణ ప్రణాళిక, కోర్సుల ఆమోదం, పాఠ్య ప్రణాళిక అమలు, కళాశాలల సన్నద్ధత, అకాడెమిక్ నిబంధనలపై సమగ్రంగా వివరించారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగానికి మేలు చేస్తుందని అభినందించారు. చీజూాూ మార్గదర్శకాల ప్రకారం కోర్సులను అమలు చేయడం ద్వారా రాష్ట్రానికి అత్యుత్తమ అలైడ్ హెల్త్ నిపుణులు అందుబాటులోకి వస్తారని తెలిపారు.

APSAHPC కార్యదర్శి శ్రీమతి సుమైలా కోర్సుల అమలుకు సంబంధించిన నిబంధనలు, మౌలిక సదుపాయాలు, కళాశాలల సన్నద్ధత, కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో వివరించారు.

సమావేశంలో ప్రతిపాదిత 17 అలైడ్ హెల్త్ కోర్సుల అమలుపై విస్తృతంగా చర్చించి, రాష్ట్రంలో అలైడ్ హెల్త్ విద్యను జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మరియు APSAHPC సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు.

# విద్యార్థుల సురక్షిత రవాణాకు పోలీసుల వినూత్న ముందడుగు..

- స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్
- స్టూడెంట్ పోర్టల్ ప్రారంభం..

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు ఇంటి నుంచి విద్యాసంస్థలకు, తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకునేలా సమగ్ర, క్రమబద్ధమైన, సురక్షిత రవాణా వ్యవస్థను రూపొందించేందుకు సైబరాబాద్ పోలీసులు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ లో భాగంగా ఆదివారం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ, గచ్చిబౌలిలో క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానించే స్టూడెంట్ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్, మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేరుకునే మొత్తం ప్రయాణం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్టూడెంట్



మొబిలిటీ ప్రోగ్రామ్ కేవలం ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం మాత్రమే కాకుండా, విద్యార్థుల ప్రాణ భద్రతకు సంబంధించిన సమగ్ర కార్యక్రమమని తెలిపారు. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, రవాణా నిర్వాహకులు, పోలీస్, రవాణా శాఖ, విద్యాశాఖ, తదితర అన్ని భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థులకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించగలమని చెప్పారు. ప్రతి విద్యాసంస్థ విద్యార్థుల రవాణాకు సంబంధించిన ప్రామాణిక విధానాలు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. సైబరాబాద్‌లోని 520కు పైగా విద్యాసంస్థల్లో సమగ్ర సర్వే, 750కు పైగా విద్యాసంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు, అలాగే 500కు పైగా విద్యార్థులతో విజయవంతంగా నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ అనంతరం ఈ క్యాంపస్ కంప్లయెన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ అధ్యయనాల ఆధారంగా విద్యార్థుల ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలను రూపొందించేందుకు స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ రూపుదిద్దుకున్నట్లు వివరించారు. వర్క్‌షాప్‌లో "సేఫ్ స్టూడెంట్ మొబిలిటీ కారిడార్స్" ఏర్పాటు, విద్యార్థుల రవాణా భద్రత, విద్యాసంస్థల పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, పాఠశాలలు, తల్లిదండ్రులు, రవాణా నిర్వాహకులు, పోలీస్ రవాణా శాఖ, విద్యాశాఖ, మధ్య సమర్థవంతమైన సమన్వయం, ప్రామాణిక విధానాలు బాధ్యతాయుత నిర్వహణ, ఉత్తమ కార్యాచరణ విధానాల అమలుపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ప్రారంభించిన స్టూడెంట్ పోర్టల్ ద్వారా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానమై విద్యార్థుల రవాణా భద్రత, సమస్యల పరిష్కారం, సమాచార మార్పిడి, సేవల సమన్వయం, పర్యవేక్షణను మరింత



సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కల్పించబడుతుందని అధికారులు తెలిపారు. స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ ద్వారా సురక్షితమైన, క్రమబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యార్థుల రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి, సైబరాబాద్‌ను దేశానికి ఆదర్శవంతమైన స్టూడెంట్ మొబిలిటీ మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ కూకట్‌పల్లి రితిరాజ్, డీసీపీ ట్రాఫిక్ ఎస్. రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. శ్రీధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ శ్యామ్, సంగమిత్ర స్కూల్ కరస్పాండెంట్ అరుంధతి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, రవాణా నిర్వాహకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ ప్రత్యేక కమిటీ ఏర్పాటు

- జిల్లా అధ్యక్షుడి ఏకపక్ష నిర్ణయాలపై అసంతృప్తితోనే ఈ నిర్ణయం
- 68 మంది సభ్యులతో కమిటీ వివరాలు రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి
- గజ్వేల్‌లో గ్రూపు రాజకీయాలు లేవు..
- రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యం..
- బీజేపీ రాష్ట్ర నాయకులు ధరమ్ గురువారెడ్డి వెల్లడి..

**గజ్వేల్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన స్థానం కల్పించాలని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఆ అంశం పరిశీలనలో ఉండగానే జిల్లా అధ్యక్షుడు ఎవరినీ



సంప్రదించకుండా కమిటీలను ఏర్పాటు చేశారని బిజెపి రాష్ట్ర నాయకులు ధరం గురువారెడ్డి ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆరోపించారు. బిజెపి రాష్ట్ర నాయకులు ధరమ్ గురువారెడ్డి మాట్లాడుతూ ఈ పరిణామంతో గజ్వేల్ నియోజక వర్గానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు అసంతృప్తికి గురయ్యారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని వందలాది మంది కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పార్టీ బలోపేతం లక్ష్యంగా 68 మంది సభ్యులతో ప్రత్యేక నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ వివరాలను రాష్ట్ర కమిటీకి పంపినట్లు వెల్లడించారు. ఈ కమిటీ రాష్ట్ర కమిటీతో సమన్వ యంగా పనిచేయడానికి సిద్ధంగా ఉందని, రాష్ట్రంలోనే కార్యకర్తల బలం అత్యధికంగా ఉన్న నియోజకవర్గంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌లో బీజేపీ జెండా ఎగరవేసేలా పనిచేస్తామని, అందుకోసం ఈ నియోజకవర్గ కమిటీకి రాష్ట్ర కమిటీ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు గజ్వేల్ పట్టణంలో బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తమ కమిటీపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, గజ్వేల్ బీజేపీలో ఎలాంటి గ్రూపు రాజకీయాలు లేవని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలందరికీ ఈ కమిటీలో



స్థానం కల్పించామని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి రాష్ట్ర కమిటీకి బహుమతిగా అందిస్తామని ధరం గురువారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని, త్వరలోనే పలు భారీ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర కమిటీ ఈ నియోజకవర్గ కమిటీకి ఆమోదం తెలిపి జిల్లా కమిటీతో కలిసి పనిచేయాలని సూచిస్తే పూర్తి సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు. ఒకవేళ ఆమోదం లభించకపోయినా ప్రజల సమస్యలపై ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని ధరం గురువారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు కుడిక్యాల రాములు, సీనియర్ నాయకులు ఉప్పల మధు సుదన్, బండారు మహేష్, వెంకట్ రెడ్డి, పవన్ స్వామి తదితరులు పాల్గొన్నారు..

# "జై జగన్నాథ్" నినాదాలతో మార్మోగిన మహేంద్రహిల్స్

- వేలాది భక్తులతో అంగరంగ వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర
- రథాన్ని లాగిన చేతులకు దైవానుగ్రహం...
- జగన్నాథుని దర్శించిన కళ్లకు ఆనందం...
- ఆయన నామస్మరణ చేసిన ప్రతి హృదయానికి ఉత్సాహం..

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే 34వ వార్షిక శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం మహేంద్రహిల్స్‌లోని శ్రీ జగన్నాథ మందిరం, గోశాల ఆధ్వర్యంలో, హరినామ ప్రచార సమితి సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో యువతీ యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా వేల సంఖ్యలో భక్తులు పాల్గొని జగన్నాథ స్వామివారి రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగుతూ స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. పుష్పాలతో, రంగురంగుల తోరణాలతో, సంప్రదాయ అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దిన రథం ముందుకు కదులుతుండగా, భక్తులు "హరే కృష్ణ హరే రామ", "జై జగన్నాథ్" నామస్మరణలతో ఆ ప్రాంతమంతా మార్మోగించారు. భక్తుల గోవింద నామస్మరణలు, భజనలు, కీర్తనలు రథయాత్రకు మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి. రథయాత్రకు ముందు, అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణలు, మంగళహారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథానికి ముందుగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ



వస్త్రధారణలో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఇవ్వడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు రథాన్ని లాగే అవకాశాన్ని పవిత్రమైన సేవగా భావించి ఉత్సాహంగా పాల్గొన్నారు. రథం ప్రయాణించిన మార్గమంతా భక్తులు స్వామివారికి హారతులు సమర్పిస్తూ, పుష్పవర్షం కురిపిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. రథయాత్ర అనంతరం జగన్నాథ స్వామివారికి చప్పన్ భోగ్ (56 రకాల నైవేద్యాలు) మహాభక్తితో సమర్పించారు. అనంతరం మహామంగళహారతి నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు, మహా ప్రసాదాన్ని వేలాది మంది భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు ఈ మహోత్సవాన్ని దైవానుగ్రహంగా అభివర్ణించారు. ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జయనిత్యలీలా ప్రవిష్ట ఓం విష్ణుపాద పరమ హంస పరివ్రజకాచార్య 108 శ్రీల త్రిదండి భక్తి సౌరభ్ నారాయణ గోస్వామి మహారాజ్‌జీ, ఆశీస్సులతో ఆలయ దాత మరునూరి శ్రీకాంత్, హరినామ ప్రచార సమితి సభ్యులు, వాలంటీర్లు, సేవాదారులు విశేష కృషి చేశారు. కాగా పరమ పూజ్యులు భక్తి విభూద వామన మహారాజ్ జీ.కొవ్వూరు, భోద యాన్ మహారాజ్ జీ, బృందావన్ నుండి విచ్చేసి భక్తులకు జగన్నాధుని లీలలు వినిపించారు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మందిర నిర్వాహకులు ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. రథయాత్ర ప్రశాంతంగా, విజయవంతంగా సాగేందుకు లాలాగూడ పోలీసులు, తుకారాం గేట్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఇతర పోలీసు సిబ్బంది విశేష సహకారం అందించారు. రథం ప్రయాణించే మార్గంలో ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించి, రహదారులను క్లియర్ చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పోలీసు శాఖ చేసిన ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రథయాత్ర సందర్భంగా పలువురు పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది సైతం స్వయంగా రథాన్ని లాగి జగన్నాథ స్వామివారి ఆశీర్వాదాలు పొందడం విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ రథయాత్ర భక్తి, సేవాభావం, సామాజిక ఐక్యత, భారతీయ సనాతన సంస్కృతి వైభవానికి ప్రతీకగా నిలుస్తూ, పాల్గొన్న ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఒకే వేదికపై భక్తి భావంతో కలిసి కట్టుగా పాల్గొనడం ఈ మహోత్సవ విశిష్టతను మరింత చాటి చెప్పింది. "జై జగన్నాథ్" నినాదాలతో మార్మోగిన ఈ రథయాత్ర భక్తుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయింది.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం..

- దానికోసమే కష్టపడే నాయకుడు మంత్రి వాకిటి శ్రీహరి..
- అయన ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలి..
- పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు..
- నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పుట్టి రాజు ముదిరాజ్..
- కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, తదితరులు..

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** వైరల్ ఫీవర్‌తో ఇటీవల అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ మెదక్ జిల్లాలోని పలువురు ముదిరాజ్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పుట్టి రాజు ముదిరాజు ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తిశ్రద్ధలతో 100 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం మంత్రి శ్రీహరి త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు వచ్చి ప్రజాసేవను కొనసాగించాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ సందర్భంగా పుట్టి రాజు ముదిరాజు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాత్రింబవళ్లు కష్టపడే నాయకుడు మంత్రి వాకిటి శ్రీహరి. ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, సేవా తపన మా అందరికీ ఆదర్శం. పెద్దమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ఆయన త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా సేవలో నిమగ్నమవుతారని మేము విశ్వసిస్తున్నాం. రాష్ట్ర ప్రజలందరి ప్రార్థనలు ఆయనకు అండగా నిలుస్తాయని పుట్టి రాజు అన్నారు. మంత్రి శ్రీహరి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని



పెద్దమ్మ తల్లిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక పూజలు మంత్రి పట్ల ప్రజలకు ఉన్న అభిమానానికి, విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రామా యంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, సత్యం, రాము, రాజు, మహిపాల్, దీపక్ తో పాటు మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మంత్రి శ్రీహరి త్వరగా కోలుకోవాలని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

## శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ




**శేరిలింగంపల్లి, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జెండా పండుగలో భాగంగా శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. చందానగర్ డివిజన్‌లోని పీజేఆర్ స్టేడియం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ అస్లాం, విష్ణుచారి, మురుగేసన్, దయానంద్, లక్ష్మి, మాధవి, సందీప్, ప్రవీణ్, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీ హరిచంద్ర శవదహన బేరర్ల కార్మిక సొసైటీ

## అధ్యక్షుడిగా ఉబ్బపల్లి నాగరాజు ఎన్నిక



**మిర్యాలగూడ జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** గాంధీనగర్‌లోని శ్రీ హరిచంద్ర శవదహన బేరర్ల కార్మిక సొసైటీ ఎన్నికలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సొసైటీ అధ్యక్షుడిగా ఉబ్బపల్లి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియ గాంధీనగర్ కౌన్సిలర్ దైద సోమ్ సుందర్ సమక్షంలో నిర్వహించ బడింది. కార్యక్రమంలో ఐదు భాగాల పరిధికి చెందిన సభ్యులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉబ్బపల్లి నాగరాజును అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దైదప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దైద నాగేష్, కోశాధికారిగా ఉబ్బపల్లి సైదులు, సహాయ కార్యదర్శిగా ఉబ్బపల్లి ప్రతాప్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పాల్గొన్న సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్మికుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేసి సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలని ఆకాంక్షించారు.

### హెచ్ ఫాస్ట్ దాడుల్లో

## ఆహార భద్రతా ఉల్లంఘనలు బట్టబయలు..

- ఆరుచోట్ల తనిఖీలు.. అరుగురు అదుపులో.. ఆసురక్షిత ఆహార పదార్థాలు స్వాధీనం..

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్సుకు చెందిన హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం రెండురోజులనుండి ఆకస్మి దాడులు నిర్వహించిన ప్రతి చోట్ల తీవ్ర ఆహార ఉల్లంఘనలు వెలుగులోకి వస్తున్నాయి. గ్రేటర్ బల్దియా, ఫుడ్ సేఫ్టీ, అధికారులతో కలిసి జంటనగరాల్లోని పలు ఆహార తయారీ యూనిట్లపై బేకరి, రిటైల్ సంస్థలను తనిఖీ చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 ప్రకారం కేసులు నమోదు చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహార తయారీకి వాడిన వంట నూనెను పదేపదే వినియోగించడం, కృత్రిమ రంగులు వాడకం, గడువు ముగిసిన నకిలీ బ్రాండ్ ఆహార పదార్థాల విక్రయం, చెల్లుబాటు అయ్యే ఎఫ్ఎస్ఎల్ లైసెన్స్ లేకపోవడం, సరైన లేబులింగ్, పెస్ట్ కంట్రోల్, నీటి పరీక్షలు, సిబ్బంది ఆరోగ్య రికార్డులు లేకపోవడం వంటి అనేక ఉల్లంఘనలు గుర్తించారు. దాడుల్లో వాడిన నూనె కృత్రిమ రంగులు, ఇతర ఆసురక్షిత పదర్థాలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ తనిఖీలో హెచ్ ఫాస్ట్ ఇన్స్‌స్పెక్టర్ ఎస్. రంజీత్ కుమార్ గౌడ్, ఎం. అంజయ్య, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.. ఆహార కల్తీ జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే 8712661212 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## బాటసింగారం గ్రామానికి కేతావత్ శ్రీరామ్ గర్వకారణం

- బాటసింగారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాధించిన ఘనత..
- తెలంగాణ 4వ రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక..

**అబ్దుల్లాపూర్ మెట్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం గ్రామ జెడ్పీహెచ్ఎస్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కేతావత్ శ్రీరామ్ తెలంగాణ 4వ రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2026కు ఎంపిక కావడం బాటసింగారం గ్రామానికి గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యా యులు దాసరి ప్రతాప్ తెలిపారు. ఈ నెల 18, 19 తేదీలలో మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో 14 సంవత్సరాల లోపు బాలుర విభాగం 600 మీటర్ల పరుగు పందెంలో కేతావత్ శ్రీరామ్ పాల్గొన్నారు. అదేవిధంగా, ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి ధన ఆంజనేయులు కూడా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గత జూన్ 12న సరూర్‌నగర్ ఇండోర్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. శ్రీరామ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల బాటసింగారం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఉపాధ్యాయులు, శారీరక విద్యా ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కేతావత్ శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బాటసింగారం గ్రామానికి, పాఠశాలకు, రంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## పెద్ద అంబర్‌పేటలో నకిలీ డీఏపీ తయారీ ముఠా గుట్టురట్టు..!

- సీఐ చరమంద రాజు చాకచక్యంతో వెలుగులోకి వచ్చిన నకిలీ ఎరువుల దందా..!
- రూ. ఒక కోటి 50 లక్షల విలువైన వెయ్యి బస్తాలు స్వాధీనం.. !
- పరారీలో నిందితులు..!

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :** సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు నేతృత్వంలో పోలీసులు చేపట్టిన దాడులతో పెద్ద అంబర్‌పేటలో నిర్వహిస్తున్న నకిలీ డీఏపీ ఎరువుల తయారీ ముఠా గుట్టురట్టైంది. సుమారు రూ. ఒక కోటి 50 లక్షల విలువైన 1,000 నకిలీ డీఏపీ బస్తాలను స్వాధీనం చేసుకోగా, పోలీసుల రాకను గమనించిన నిందితులు పరారయ్యారు. సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ రైతు నకిలీ డీఏపీ కొనుగోలు చేసిన ఘటనపై మఠంపల్లి మండలంలో నమోదైన కేసు విచారణలో కీలక ఆధారాలు లభించాయి. ఆ దర్యాప్తును విస్తరించిన పోలీసులు పెద్ద అంబర్‌పేటలోని గోదాముపై మెరుపు దాడి నిర్వహించారు. తనిఖీల్లో సాల్ట్, గ్రోమోర్, కోరమండల్, అన్నపూర్ణ తదితర ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో ఉప్పు, మట్టి తదితర నాసిరకం పదార్థాలను రసాయనాలతో కలిపి డీఏపీగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు.



## గడ్కోల్ గురుడు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పుర్ గంగారెడ్డి

**-సంఘ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి**



**నిజామాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిరికొండ మండల పరిధిలోని గడ్కోల్ గ్రామ గురుడు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పుర్ గంగారెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గంగారెడ్డిని సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతంతో పాటు, సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గురుడు కాపు సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సిరికొండ కేజీబీవీ హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం

**-విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు**

**నిజామాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :**




సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) పరిధిలోని సర్వపల్లి తండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (KGBV) హాస్టల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం విజయవంతంగా కొనసాగింది.ముఖ్య విశేషాలు:ఆరోగ్య పరీక్షలు: శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులకు హిమోగ్లోబిన్ (Hb), మలేరియా, మరియు డెంగ్యూ వంటి వివిధ రకాల రక్త పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.అవగాహన సదస్సు: పరీక్షలతో పాటు విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు మరియు సిబ్బంది ప్రత్యేక అవగాహన కల్పించారు.పరిసరాల పరిశీలన: హాస్టల్ ప్రాంగణాన్ని సందర్శించిన వైద్యాధికారి.. అక్కడ నీరు నిల్వ ఉండటం, తాగునీటి నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించారు.సిబ్బందికి సూచనలు: వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాపించకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి డాక్టర్ అరవింద్ స్పష్టమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, కేజీబీవీ హాస్టల్ అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ధర్పల్లి ఎన్టీఆర్ కాలనీలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రామ్.. 32 వాహనాలు సీజ్



**నిజామాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

ధర్పల్లి మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో పోలీసులు శనివారం ఉదయం 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రామ్ నిర్వహించారు. ఏసీపీ గారి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బందితో కలిసి కాలనీలో విస్తృతంగా ఇంటింటి తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు (డాక్యుమెంట్స్) లేని 32 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.ఈ సందర్భంగా అధికారులు స్థానిక ప్రజలతో సమావేశమై పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారుకాలనీల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు.ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రయాణాల్లో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన పత్రాలను ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం

**- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**

**బోనకల్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**



సాంస్కృతిక రంగంలో మార్పులు ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన స్టడీ సర్కిల్ లో సాంస్కృతిక రంగంలో మార్పులు అనే అంశంపై ఆయన మాట్లాడారు. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రత్యామ్నాయ శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరిసే సమాజంకోసం అభ్యుదయ కవులు, కళాకారులు, రచయితలు పని చేయాలని పల్లా కొండలరావు కోరారు. రాజుల కాలం నుండి కవులు, కళాకారులు, రచయితలు ఒకే రకంగా లేరన్నారు. నేడు కూడా దోపిడీ శక్తులకు భజన చేసే వారు, వాటిని నిరోధించేందుకు ప్రయత్నం చేస్తున్నవారూ ఉన్నారన్నారు. సమాజంలో సంప్రదాయాలను యథాతథంగా కొనసాగేలా ఉండే కార్యక్రమాలు, సంస్కృతిని కాకుండా ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించేందుకు, వాటిని ప్రజలు ఆచరించేలా చైతన్య పరిచేందుకు రచనలు, కళలు దోహదం చేయాలన్నారు. దేశంలో ప్రశ్నించే, ఆలోచింపజేసే, ప్రగతిశీల శక్తులను నిలువరించేందుకు, నిర్బంధించేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని, వాటిని నిస్సిగ్గుగా బహిరంగంగా సమర్థించే లంపెన్ శక్తులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కళ కల కోసమో, కాసుల కోసమో కాకుండా ప్రజలను జాగృతం చేసేందుకు ఉపయోగ పడాలన్నారు. నేటి కార్పొరేట్ సంస్కృతిలో పాలకులను పొగుడుతూ పాటలు రచించి సంపాదించేవారు, వాటి ఆధారంగా డిజేలతో విష సంస్కృతివైపు యువతను నడిపిస్తున్నశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను ఆలోచించకుండా, ప్రశ్నించకుండా, పోరాటాలవైపు మళ్ళకుండా చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు భిన్నంగా ఆచరణలో ప్రత్యామ్నాయ కార్యక్రమాలు, కళలు రూపొందించేందుకు అభ్యుదయ రచయితలు ముందుకు రావాలని, వారిని ప్రజలు కాపాడుకోవాలని, ప్రోత్సాహం అందించాలని కోరారు. ఇది జరుగుతుంటే సమాజం మళ్ళీ అంధకారంలోకి నెట్టబడడం ఖాయమన్నారు. ప్రస్తుతం దేశంలో దుర్మార్గమైన, ప్రమాదకరమైన సంస్కృతిని పెంచేందుకు పాలకులు ప్రయత్నం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కిలారు సురేష్, గుగులోతు నరేష్, బొప్పాల రమేష్, చేపూరి వెంకటేశ్వర్లు, కొండేటి అప్పారావు, జొన్నలగడ్డ సునీత, కుక్కల కోటేశ్వరరావు,కూచిపూడి మురళి, కౌసాని సూర్యప్రకాష్ రావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, గండు సైదులు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

**అటవీ–రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి - మంత్రి పొంగులేటి**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**



జిల్లాలో చేపడుతున్న భూముల రీ–సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీ–సర్వే పనుల్లో జాప్యం, నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.ఆదివారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూముల రీ–సర్వే పురోగతి, అటవీ–రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో 70 గ్రామాల్లో రీ–సర్వే చేపట్టగా ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పాల్వంచలో సర్వే పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, జాప్యానికి కారణాలను వెంటనే తొలగించాలని సూచించారు.రీ–సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు సర్వేయర్లు, రోవర్ పరికరాలు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అటవీ– రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గతంలో పోడు సాగు చేసిన వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రీ–సర్వే పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లో కూడా గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటిడిఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జంగం మహేష్ స్వామి కి సన్మానించిన వీరశైవ సమాజం

**- చౌకీ మఠం సభ్యులు**



**సంగారెడ్డి, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన కార్యవర్గంలో సదాశివ పేట వీరశైవ సమాజం చౌకీమఠం సభ్యులు జంగం మహేష్ స్వామి తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గా ఎన్నికైన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించినట్లు అధ్యక్షులు చీల మల్లన్న అన్నారు.వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని అన్నారు.ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం మునుముందు మరిన్ని గొప్ప అవకాశాలు చేజిక్కించుకోవలని అన్నారు.సమాజ సభ్యులు అందరూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గౌరవ అధ్యక్షులు బోడగామ శ్రీ శైలం కోశాధికారి పులుమామమిడి వీరేశం సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక "బోనం"..

**-పలు సంఘాల బోనాల పండుగలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్...**

**నిజామాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**





తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ బోనాలు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కోటగల్లిలో గల కట్ట మైసమ్మ ఆలయం,నాందేవ్ వాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆషాఢ మాసం తెలంగాణకు ప్రత్యేక మాసం అన్నారు.గ్రామ దేవతలకు పూజిస్తూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కొలిచే పండగ అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని,ఇది మన పూర్వీకుల సంప్రదాయాన్ని.. గ్రామదేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక వేడుక అన్నారు.బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని.. కొత్త కుండలో పెట్టి, వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల నృత్యాలు,ఘటం ఊరేగింపులు,రంగం వంటి సంప్రదాయాలు పండుగకు మరింత వైభవాన్ని తీసుకువస్తాయన్నారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, కోటగల్లి మైసమ్మ ఆలయ ప్రతినిధులు దేవేందర్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


# రావిగూడెంలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం



**ఖమ్మం, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

శ్రీరక్ష హాస్పిటల్, ఖమ్మం నెహ్రూ నగర్, కేజిహెచ్ హాస్పిటల్ – ఖమ్మం మయూరి సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ మండలం, రావిగూడెం గ్రామం, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రావిగూడెం గ్రామంలోని ఎంపిపిఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో, శ్రీరక్ష హాస్పిటల్ (ఖమ్మం – నెహ్రూ నగర్), కేజిహెచ్ హాస్పిటల్ (ఖమ్మం – మయూరి సెంటర్) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిట్టి బాబు ఆధ్వర్యంలో, జుజ్జూరి వెంకటేశ్వర్లు – సత్యవతి దంపతుల కుమారుడు జుజ్జూరి నాగార్జున, యామిని దంపతుల కుమార్తెలు జోషిత, నియశ్రీల పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని సమాజ సేవా దృక్పథంతో నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో శ్రీరక్ష హాస్పిటల్ అధినేత డా. గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జివి ), డా. షేక్ ఏడుకొండలు, ఖమ్మం జిల్లా జై గౌడ సంఘం అధ్యక్షులు హనుమంతరావు, కేజిహెచ్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన వైద్య సలహాలు, జీవనశైలి మార్పులపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌కు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది అనే భావనతో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎంఓ సాత్విక్, గజ్జెల శ్రీనివాస్, ఆత్మకూరి నాగేశ్వరావు, అరుణ్ కుమార్, గంజర్ల శ్రీకాంత్, రాయల శ్రీకాంత్, కనితి సరోజిని, కేజిహెచ్ హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరావు, కమలాకర్, ఎర్లీ ఆన్ లైఫ్ సెన్సెస్ మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రతినిధి అంకురావు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడంలో తమ వంతు సహకారం అందించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో శ్రీరక్ష హాస్పిటల్, కేజిహెచ్ హాస్పిటల్ సంయుక్తంగా ఇలాంటి ఆరోగ్య సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా విస్తృతంగా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు

# భక్తి శ్రద్ధలతో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవం



**సికింద్రాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

వేద మంత్రాల నడుమ సికింద్రాబాద్ జనరల్ బజార్ లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవం జరిగింది. ఆదివారం ఉదయం చతుస్థానార్చన, మహాకుంభ ఆవాహనం, మూలమూర్తి హవనము, పంచవిశింతి కలశస్నపనం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ క్రతువులతో పాటు అనంతరం నిర్వహిం చిన గోష్టిలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కన్నుల పండువగా నిర్వహించిన ఈ వార్షికోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ అనువంశిక ధర్మకర్త గుమిడెల్లి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రేమ్ కుమార్ రావులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# తీపి గురుతుల కలబోత, అంబరాన్నంటిన ఆత్మీయత

- బాల్యపు జ్ఞాపకాలతో సందడి చేసిన పాత నేస్తాలు



**ఖమ్మం, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఎక్కడో వదిలేసిన బాల్యం మళ్లీ కళ్ల ముందుకొచ్చింది. నాలుగు దశాబ్దాల క్రితం నాటి స్మృతులు ఆత్మీయ పలకరింపులతో ప్రాణం పోసుకున్నాయి. పలకల మీద రాసుకున్న అక్షరాలు చెరిగిపోయినా, మనసుల మీద ముద్రించుకున్న స్నేహం చెరగదని ఆ పాత నేస్తాలు నిరూపించారు. నేలకొండపల్లి మండలం అనంతనగర్‌లోని అరవింద విద్యాలయం 1987, 88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఖమ్మం వైరా రోడ్డులోని త్రివేణీ స్కూల్ ప్రాంగణంలో అట్టహాసంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గతస్మృతుల్లో పరవశించిపోయారు.--- ఆటపాటలతో సందడి ఉదయం అల్పాహారం అనంతరం పీఈటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో పూర్వ విద్యార్థులంతా వయసును మరిచిపోయి ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ రోజుల నాటి ఆటలు, పాటలతో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుక ఏర్పాట్లలో, ముఖ్యంగా క్రీడలు, విందు, బహుమతుల పంపిణీలో తిరుపతి నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన మిత్రురాలు రూపారాణి తీసుకున్న చొరవను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.--- ఈ సత్కారం నా జీవితంలో మరువలేనిదిఈ సందర్భంగా, పోలీసు శాఖలో అద్భుత ప్రతిభ కనబరిచి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే మహోన్నత సేవా పతకం అందుకున్న ఖమ్మం ఇంటెలిజెన్స్ సీఐ చల్లగుండ్ల శ్రీనివాసరావును మిత్రులంతా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఉద్వేగంతో మాట్లాడుతూ పోలీసు శాఖలో నేను ఎన్నో పతకాలు సాధించినా కూనవరం వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చగలిగానంటే ఆ ధైర్యం, క్రమశిక్షణ నాకు ఈ బడిలోనే అలవడ్డాయి. నేను ఎన్ని స్టేట్ మెడల్స్ అందుకున్నా, నా చిన్ననాటి స్నేహితుల చేతుల మీదుగా అందుకుంటున్న ఈ ఆత్మీయ సత్కారం నా జీవితంలో అత్యంత మధురమైనది, చిరస్థాయిగా నిలిచిపోయేదని తన అనుభవాలను పంచుకున్నారు.--- మళ్లీ కలుసుకోవడం నా అదృష్టం ఇదే బ్యాచ్‌కు చెందిన మిత్రుడు, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యనభ్యసించి ప్రస్తుతం అమెరికాలో ఉన్నతస్థాయిలో స్థిరపడిన అవినేని ఆనంద్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు ఆయనను వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడినా, తన మూలాలు, మిత్రులు ఇక్కడే ఉన్నారన్నారు. తాను ఇండియాకు వచ్చిన సమయంలోనే ఈ కార్యక్రమం జరగడం, దశాబ్దాల తర్వాత అందరినీ మళ్లీ ఇలా కలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల్లో ఉన్నా, తమ స్నేహం ఏమాత్రం చెక్కుచెదరలేదని సంతోషం వ్యక్తం చేశారు.--- కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం, నిర్వాహక బృందం తరపున టి.ఎస్.రెడ్డి మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ఏమాత్రం ఆలోచించకుండా వేదికను సమకూర్చిన త్రివేణీ విద్యాసంస్థల అధినేత వీరేంద్రనాథ్ చౌదరికి, అడుగడుగునా ఏర్పాట్లు పర్యవేక్షించిన ఇన్‌చార్జ్‌లు సందీప్, చార్లెస్‌లకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని ఆద్యంతం హుషారుగా నడిపించిన యాంకర్ విజయశ్రీ, ఆటలు ఆడించిన పీఈటీ శ్యామ్ మాస్టర్, కృష్ణ మోహన్, ఫొటోగ్రాఫర్, దూరప్రాంతాల నుంచి శ్రమకోర్చి విచ్చేసిన పూర్వ విద్యార్థులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తిరిగి మళ్లీ ఇలాగే కలుసుకుందామన్న ఆత్మీయ వీడ్కోలుతో ఈ సమ్మేళనం కనులపండువగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల యం. అప్పారావు, పార్ధ సారధి, శివారెడ్డి, లింగారెడ్డి, ఉపేందర్, పాషా, జానకి రామయ్య, తిరుపతి రావు, నాగమణి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# కోసూరి కుటుంబానికి భరోసా : మంత్రి తుమ్మల



**ఖమ్మం, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం నగరంలో గల త్రీ టౌన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోసూరి రమేష్ గౌడ్ ఇటీవల పరమపదించారు. ఈ విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదివారం రమేష్ గౌడ్ ఇంటికి వెళ్లి ఆ కుటుంబాని ఓదార్చారు. మీకు నేను ఉన్నాను అని భరోసా ఇచ్చారు. తొలుత కోసూరి రమేష్ గౌడ్ నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి తుమ్మల వెంట, నగర కాంగ్రెస్ నాయకులు, త్రీ టౌన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైశ్యులు ఐక్యతగా ఉండాలి - పట్టణ సంఘం ఆధ్వర్యంలో వనభోజనం..



**నిజామాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

వైశ్యులంతా ఐక్యతగా ఉండాలని రాజకీయంగా ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఉత్తర తిరుమలలో వనభోజనం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఆషాడ మాసంలో ప్రతి సంవత్సరం వనభోజనాలను ఆనవాయితీగా నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆటపాటలతో వైశ్యులంతా ఒక చోటికి చేరడం సంతోషంగా ఉందన్నారు.వైశ్యులంతా ఐక్యతగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు.వైశ్యులు అంటే కేవలం వ్యాపారమే కాదని ఆధ్యాత్మికత,ఆలయ అభివృద్ధిలో ముందుంటారని గుర్తు చేశారు.ప్రధానంగా సేవా కార్యక్రమాల్లో వైశ్యులకు సాటి ఎవరు లేరన్నారు.అంతకుముందు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధన్పాల్ శ్రీనివాస్ గుప్తా,ఇల్లెందుల ప్రభాకర్,కోశాధికారి గాలి నాగరాజు,కార్యవర్గ సభ్యులు,ఆలయ ధర్మకర్త సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి




**ఖమ్మం, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్ వ్యవస్థను పూర్తిస్థాయిలో పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగులకు 010 పద్దు కింద నేరుగా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని టీఎస్ఎంఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి. కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా టీఎస్ఎంఎస్టీఎఫ్ సమావేశం యుటియఫ్ భవన్ లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడంలో మోడల్ స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మోడల్ స్కూల్స్ లో సంవత్సరాలుగా సేవలందిస్తున్న టీజీటీలకు నోషనల్ సర్వీస్ ప్రయోజనం అందించాలని కోరారు. అలాగే ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 317 జీవో ప్రకారం కేటాయింపులు పూర్తి చేసి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్స్ అభివృద్ధి, ఉద్యోగుల న్యాయమైన హక్కుల పరిరక్షణ మరియు విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలివేరు మహేష్, టియస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, మోడల్ స్కూల్స్ బాధ్యులు నాగరాజు, రంజిత్, సాత్విక్, మోహనరావు, నాగార్జున, ఫణికుమార్, ఉపేందర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం మాదిరిగా కృష్ణా నదిపై బ్యారేజీలు నిర్మించాలి



**వనపర్తి, జూలై 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణ నది సుమారు 200 కిలోమీటర్ల ప్రవహిస్తూ..ఉన్న నిర్వసితులుగా మారిన కొల్లాపూర్, అ ల ంపూర్, గద్వాల వనపర్తి జిల్లాలో సాగు,తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదిపై బ్యారేజ్ కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయాలని,అలాగే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు నీటి కేటాయింపు చేయాలనీ ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో క్రౌన్ గార్డ్ ఫంక్షన్ హాల్ లో సాగు నీటి సమస్య పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లాపూర్ నియోజక వర్గం జేఏసీ తరుపున పాల్గొన పెరుమాళ్ళ శ్రీనివాస్ అన్నారు.జూరాల, బీమా చివరి ఆయకట్టు అయిన ఉమ్మడి వీపనగండ్ల మండలంలో సుమారు 45 వేల ఎకరాల కు నీళ్ళు అందించడానికి కృష్ణ నదిపై మరో లిఫ్టు కానీ,లేదా బ్యారేజ్ నిర్మాణం చిన్నంబావి మండలంలో ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టి కి తీసుకెళ్లారు.ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లు రవి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వివిధ పార్టీల జిల్లా అధ్యక్షులు, పలు నియోజకవర్గాల జేఏసీ ఇన్చార్జీలు,రాఘవాచారి,ప్రకాశ్ గౌడ్,తిమ్మప్ప,వెంకటేశ్వర్లు, అడ్వకేటు బెక్కం జనార్ధన్,వేణుగోపాల్ చారిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జేఏసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం లోకొల్లాపూర్ తరుపున తెలంగాణ ఉద్యమకారులు దేశగౌని రామన్ గౌడ్,పెరుమాళ్ళ తిరుపతి, పెరుమాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి




○ గడువులోగా పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు : కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించి, అవి మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.
ప్రజలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, పీజీఆర్ఎస్‌తో పాటు ఇతర వేదికల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. కేవలం రికార్డుల్లో అర్జీలు పరిష్కరించినట్లు నమోదు చేయడం కాకుండా, దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు.
పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే వాటిని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేసి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ సందర్భంగా మొత్తం 36 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 6, ఇంజినీరింగ్ విభాగానికి 20, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి ఒకటి, యూపీఏ సెల్‌కు 3, అకౌంట్స్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు.
కార్యక్రమంలో అదనపు కమిషనర్ కిషోర్, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏఓ జీటీ నాయుడు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



○ దేగల ప్రభాకర్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజల వినతిపత్రాలను స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అత్యవసర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించడంతో పాటు, ప్రతి వినతిని నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పారదర్శక పాలన, వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూనే అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

## నేడు, రేపు పెన్షన్ అండ్ జి.పి.ఎఫ్ అదాలత్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో పెన్షన్ అండ్ జిపిఎఫ్ అదాలత్ ను జూలై 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ&ఈ) ఎస్. శాంతి ప్రియ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో గల శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ అదాలత్ ను నిర్వహిస్తున్నామని, సంబంధిత జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, డీడీవోలు, పీఎస్ఏలు ఈ కార్యక్రమంలో పాల్గొని వేగంగా, పారదర్శకమైన, ఇబ్బందులు లేని పదవీ విరమణ సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్, జీపీఎఫ్, పదవీ విరమణ సేవలకు సంబంధించిన అంశాలలో తక్షణ మార్గదర్శకత్వం, ఫిర్యాదుల పరిష్కారం, మద్దతును అందించడం ద్వారా పెన్షన్, జీపీఎఫ్ సేవలను సరళతరం చేయడమే పౌర కేంద్రీకృత కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో అందించుటకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ&ఈ)తో పాటు సీనియర్ అధికారులు, పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డీడీవోలు), పింఛను మంజూరు అధికారులతో నేరుగా మాట్లాడి పింఛను, జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి సేవలో బద్వేల్ టీడీపీ ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి



○ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారిని సోమవారం నాడు తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు వీరికి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుష్యాలువా తో సత్కరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆధారాలు లేని ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి

○ క్షమాపణ చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

○ ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన ఘటనను రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తూ తనపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు వెంటనే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హెచ్చరించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.
కృష్ణబాబు కాలనీ ఘటనను రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఖండించారని, మహిళా కమిషన్‌తో పాటు సంబంధిత శాఖలు స్పందించి చర్యలు తీసుకున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే కొందరు వైసీపీ నాయకులు ఈ ఘటనను వక్రీకరిస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని, ముఖ్యంగా అంబటి రాంబాబు విలేకరుల సమావేశం, వీడియోల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.
ఘటనలో తన ప్రమేయం ఉందంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని గల్లా మాధవి అన్నారు. బాధిత మహిళ న్యాయం కోసం వచ్చిన వెంటనే స్పందించి అధికారులను ఆదేశించామని, ఎఫ్ఐఆర్ నమోదుతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. ఈ ఘటనకు రాజకీయాలు, కులాలు, మతాలతో సంబంధం లేదని, బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళ అనుభవించిన క్షోభను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం హేయమైన చర్య అని గల్లా మాధవి విమర్శించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై రాజకీయ విమర్శలు చేయాలని, వ్యక్తిగతంగా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తనపై చేసిన ప్రతి ఆరోపణకు ఆధారాలు చూపాలని సవాల్ విసురుతూ, వెంటనే క్షమాపణ చెప్పకపోతే పరువు నష్టం దావాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# అర్జీదారుని సంతృప్తే లక్ష్యంగా సమస్యలు పరిష్కరించాలి

○ జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం పై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు.
సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యుటీ కలెక్టర్లు గంగరాజు, డేవిడ్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం గురించి ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తుందని, కావున అర్జీలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. వివిధ రకాల సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిశీలించి పరిష్కరిస్తేనే అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తారన్నారు. ఎక్కువ రోజులు పెండింగ్ లో ఉంచకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు జాయింట్ కలెక్టర్ స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సి ఈ ఓ జ్యోతి బసు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, ఆర్ టి ఓ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ చేసిన యస్.సి మహిళలకు ఇజ్రాయెల్ లో ఉపాధి అవకాశం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నర్సింగ్ చేసిన యస్.సి మహిళలకు ఇజ్రాయెల్ లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని యస్.సి.కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. దుర్గా భాయి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (చీూణజ) సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. నర్సింగ్ చేసిన యస్.సి మహిళలకు ఇజ్రాయెల్ దేశంలో ఉపాధి అవకాశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. దరఖాస్తులను గుంటూరు యస్.సి.కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. హోం బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలు మూడు వేల ఐదు వందలు ఉన్నాయని తెలిపారు.
25 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. 1.5 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు, కనీసం 45 కేజీలు లేదా అంతకంటే ఎక్కువ బరువు కలిగి ఉండాలని, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి, ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్లంలో ప్రావీణ్యం (CEFR- B2 స్థాయి) కలిగి ఉండాలని అన్నారు. సంరక్షణ సేవలను అందించడంలో అర్హత, అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. సంబంధిత భారతీయ అధికారుల ద్వారా గుర్తింపు పొందిన లేదా పర్యవేక్షించిన కనీసం 990 గంటల (ఆన్-ది-జాబ్ ట్రైనింగ్తో సహా) సంరక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసినట్లు రుజువు చేస్తూ, సమర్థ భారతీయ నియంత్రణ సంస్థ జారీ చేసిన సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. లేదా సంబంధిత భారతీయ అధికారులచే గుర్తింపు పొందిన భారతీయ శిక్షణా సంస్థ అందించిన నర్సింగ్, ఫిజియోథెరపీ, నర్స్ అసిస్టెంట్ లేదా మిడ్ వైఫరీలో శిక్షణ పూర్తి చేసినట్లు రుజువు చేసే డిప్లొమా కలిగి ఉండాలన్నారు. జి.డి.ఏ, ఏ.ఎన్.ఎం, జి.ఎన్.ఎం, బి.ఎస్సీ నర్సింగ్, బి.ఎస్సీ పోస్ట్ నర్సింగ్ అర్హత కలిగిన వారు కూడా అర్హులన్నారు. పాస్పోర్ట్ కనీసం మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటు కావాలని అన్నారు. వేతనం నెలకు రూ. 1,99,700/- గా ఉంటుందని తెలిపారు. ఎంపిక, తిరస్కరణ నిర్ణయాలు ఇజ్రాయెల్ యాజమాన్యం తీసుకుంటుందన్నారు. ఇతర వివరాలకు కార్య నిర్వాహణాధికారి కె. వాణి (9705623027)ని సంప్రదించవచ్చని తెలిపారు.

# మిస్సింగ్ కేసును ఛేదించిన తాడికొండ పోలీసులు

○ దోపిడీ కోసం హత్య చేసిన ఐదుగురు అరెస్ట్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మిస్సింగ్ కేసును ఛేదించి, దోపిడీ కోసం పథకం ప్రకారం హత్య చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, తుళ్లూరు డీఎస్పీ టీ. మురళీకృష్ణ పర్యవేక్షణలో, తాడికొండ సీఐ ఆర్. ఉమేష్ ఆధ్వర్యంలో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. ఫణిధరం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదుగుల శంకరరావు వద్ద ఉన్న నగదు, బంగారం దోచుకోవాలనే ఉద్దేశంతో ప్రధాన నిందితుడు దేవరకొండ నాగేశ్వరరావు అలియాస్ ఓంకార్ తన సహచరులతో కలిసి కుట్ర పన్ని, భూమి కొనుగోలు పేరుతో బాధితుడిని నమ్మించి కారులో తీసుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు.
జూలై 7న వంకాయలపాడు సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో నిందితులు బాధితుడిని కొరియా తాడుతో గొంతు బిగించి హత్య చేసి, నాలుగు బంగారు ఉంగరాలు, బంగారు గొలుసు, రూ.72 వేల నగదును అపహరించినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం మృతదేహాన్ని పొత్తూరు సమీపంలోని క్వారీ గుంతలో పడవేసి, బాధితుడి మొబైల్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా మాట్లాడి, తర్వాత సిమ్ కార్డును ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజ్, సాక్షుల వాంగ్మూలాలు తదితర ఆధారాల ఆధారంగా దర్యాప్తు జరిపి, తాడికొండ ఎంఆర్వో కార్యాలయం వద్ద లొంగిపోయిన నిందితులను అరెస్టు చేశారు. విచారణలో నిందితులు గతంలో వెంగలయపాలెంకు చెందిన నాగరాజును కూడా హత్య చేసి మాచర్ల సమీపంలోని సాగర్ కుడి కాలువలో మృతదేహాన్ని పడవేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్లు, నగదు తదితర కీలక వస్తువులను స్వాధీనం చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ క్లిష్టమైన మిస్సింగ్-కమ్-మర్డర్ కేసును ఛేదించిన తాడికొండ సీఐ ఆర్. ఉమేష్, ఎస్ఐ జేత్యనాయక్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ప్రభుత్వ సేవలు పక్కాగా అందాలి : జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు పక్కాగా అందించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్, ఎస్.ఐ.ఆర్, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలు పట్ల తల్లులకు తెలియజేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తమ పర్యటనలో భాగంగా పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలను సందర్శించాలని అన్నారు.
ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు (ఆబ్సెంట్), ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారు (షిఫ్టెడ్), మరణించినవారు (డెడ్), డూప్లికేట్, క్రింద ఉన్న ఓటర్లు పక్కాగా పరిశీలించాలన్నారు. మ్యాపింగ్ జరగని కేసులు, ఎనామలిస్ కేసులను పరిశీలించాలని చెప్పారు. ఈ నెల 24వ తేదీ వరకు సమయం ఉందని, అన్ని అంశాలు స్పష్టంగా పక్కాగా ఉండాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, సమాచారం అందించాలని అన్నారు. వి.బి జి రామ్ జి పథకం కింద వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. మోడల్ చెరువులను తయారు చేయాలని సూచించారు. 24వ తేదీ నాటికి ఉద్యోగుల తుది సీనియారిటీ జాబితా విడుదల చేయాలని ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ ముగించాలని స్పష్టం చేశారు.

**గ్రీన్ గుంటూరు**

గ్రీన్ గుంటూరు కార్యక్రమం క్రింద ఆగస్టు 15వ తేదీ నాటికి 1.25 లక్షల మొక్కలు నాటుతున్నామని, ప్రతి మొక్కకు జియో టాగింగ్ చేయాలని ఆదేశించారు.

**24న మెగా పి.టి.ఎం**

24న మెగా పి.టి.ఎం జరుగుతుందని, ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. అన్ని యాజమాన్యాల విద్యా సంస్థలలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 22వ తేదీన తల్లికి వందనం పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు.
జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పట్ల దృష్టి సారించాలన్నారు. రీ సర్వే, పునరావాసం కల్పించడం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పి.జి.ఆర్.ఎస్ అర్జీపై స్పష్టమైన సమాచారం అందించాలని చెప్పారు. రీ సర్వేలో భాగంగా ఇకెవైసి చేయించాలన్నారు.
ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, ఎస్.డి.సి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు : పిల్లి మాణిక్యరావు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాల్లో రాజకీయ నాయకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుంటూరులో మహిళపై జరిగిన ఘటనను సభ్య సమాజం ఖండిస్తోందని, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించి నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారని చెప్పారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారని, చట్టం తన పని తాను చేసుకుంటోందన్నారు. ఈ ఘటనను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరికాదని పిల్లి మాణిక్యరావు విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. గుంటూరు ఘటనపై పదేపదే రాజకీయ వ్యాఖ్యలు చేయడం బాధితురాలికి మరింత ఇబ్బంది కలిగించే చర్యేనని పేర్కొన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయడమే అందరి లక్ష్యంగా ఉండాలని, ఇలాంటి ఘటనలను రాజకీయ రంగు పులమడం బాధ్యతారాహిత్యమని అన్నారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలను పిల్లి మాణిక్యరావు తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయాల కోసం కులాలు,

## జీవో నెంబర్ 396 ను ప్రభుత్వం రద్దు చేయాలంటూ దస్తావేజులేఖరులు డిమాండ్



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలని దస్తావేజులేఖరులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక కొత్తపేటలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట దస్తావేజులేఖరులు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దస్తావేజులేఖరులు మాట్లాడుతూ ఈ జీవో అమలుతో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పాత దస్తావేజులు కలిగిన భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. పది రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలియజేశారు.
దస్తావేజువిలేకరుల అభిప్రాయం ప్రకారం, జీవో 396లోని కొన్ని నిబంధనల కారణంగా భూముల కొనుగోలు, అమ్మకాలు మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం అవుతోందని, సాధారణ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందనివారు తెలిపారు. భూములకు సంబంధించిన పత్రాల పరిశీలనలో అధిక నియంత్రణలు ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిబంధనలను ఉపసంహరించుకుని, పారదర్శకంగా మరియు సులభతరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగేందుకు జీవో నెం. 396ను రద్దు చేయాలని లేదా అవసరమైన సవరణలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దస్తావేజులేఖరులు, సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు తహసిల్దార్ ఆర్థిక సాయం



బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండల పరిధిలో ఇటీవల తెలుగు గంగ కాలువలో మృతిచెందిన ఇద్దరు ఎస్సీ యువకుల కుటుంబాలను బి.మఠం తహసీల్దార్ కె. కార్తీక్ సోమవారం పరామర్శించారు. మూడమల గ్రామానికి చెందిన కొడూరు సతీష్ కుటుంబాన్ని, గుండాపురం గ్రామానికి చెందిన పందింటి ఓబులేష్ కుటుంబాన్ని వారి నివాసాలకు వెళ్లి కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక దాతల సహకారంతో సమీకరించిన నిధుల ద్వారా ప్రతి కుటుంబానికి 10000 చొప్పున అత్యవసర ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో వారికి మానసిక ధైర్యం చెప్పిన తహసీల్దార్ ఈ కష్ట సమయంలో సమాజం మొత్తం వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించి సంబంధిత శాఖల విచారణ కొనసాగుతోందని వాస్తవాలు విచారణ అనంతరం వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు తమకు అండగా నిలిచిన స్థానిక దాతలకు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పేషంట్లకు సేవలందించడంలోనే అపారమైన సంతృప్తి



○ సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్య

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): డాక్టర్ అఫ్ ఫార్మసీ డిగ్రీ ద్వారా, మెడికల్ ప్రొఫెషనల్ గా పేషంట్లకు ఆరోగ్య సంరక్షణ సలహాలు ఇవ్వడం, ఔషధాలపై పూర్తి అవగాహన, భరోసా ఇవ్వడం, మందుల మోతాదులు, దుష్ప్రభావాలు, ఉపయోగించే పద్ధతి, నిల్వ విధానాలను ప్రతి రోగి కి వెల్లడించడం లోనే అసలైన అనుభూతి, సంతృప్తి లభిస్తుందని సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ జీ. లక్ష్మీ కౌసల్య పేర్కొన్నారు. గుంటూరు నగరంపాలెంలోని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి (సీ.జీ.హెచ్.ఎస్) విజయవాడ నుండి బదిలీ పై వచ్చిన లక్ష్మీ కౌసల్య సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధి లోని ఐదు జిల్లాల ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన నాణ్యమైన ఉత్పత్తులను సిఫార్స్ చేసి, అందించడమే తన లక్ష్యమన్నారు. ఇక్కడి డాక్టర్ల సలహాలు, సూచనలతో రోగులకు విలువైన సేవలు అందిస్తానని వెల్లడించారు. సీ.జీ.హెచ్.ఎస్ లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామయ్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లులు, నూతన ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్య కు పుష్పగుచ్చం అందించి మాట్లాడుతూ.. అత్యంత నైపుణ్యం, విశ్వసనీయత కలిగిన ఔషధ నిపుణులుగా రాణించాలని కోరారు. మందుల భద్రత, స్టాక్ నిర్వహణతో పాటు రోగులకు మందులను సరిగ్గా అందించాలని సూచించారు. తొలుత లక్ష్మీ కౌసల్య చీఫ్ మెడికల్ ఆఫీసర్లు కొండా నాగార్జున, దాసరి రమేష్ లను మర్యాదపూర్వకంగా కలిసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి, వైద్య సిబ్బంది సునీల్, పేరేశ్వరరావు, రామారావు తదితరులు లక్ష్మీ కౌసల్య కు శుభాకాంక్షలు తెలిపారు.

## 22న స్త్రీ,శిశు,దివ్యాంగ,సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ సమావేశం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):ఈనెల 22వ తేది బుధవారం ఉ.10.30 గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో మహిళా శిశు దివ్యాంగ,సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్లో జరగనుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలియజేశారు.

## మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించం

○ గుంటూరు ఘటనలో నిందితులకు కఠిన శిక్ష విధించాలి

○ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరులో మహిళపై జరిగిన దాడి అత్యంత అమానవీయమని, ఈ ఘటనను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని చేతిలోకి తీసుకున్న వారికి రాజకీయ పార్టీ, కులం, మతంతో సంబంధం లేకుండా కఠిన శిక్షపడాలని అన్నారు. ఘటనపై పోలీసులు సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
ఈ ఘటనలో దోషులు ఎవరైనా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం, పోలీసు శాఖను కోరారు. మహిళలపై దాడుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళల భద్రత, సాధికారతకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.
బాధాకరమైన ఘటనలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం బాధ్యతారాహిత్యమని వల్లూరు జయప్రకాశ్ నారాయణ విమర్శించారు. మహిళల బాధను రాజకీయ రంగు పులమేందుకు ప్రయత్నించడం సరికాదని, మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ రాజీపడదని స్పష్టం చేశారు.

## 'మన ఊరు-మన జెండా' కార్యక్రమంలో బీజేపీ జెండా ఆవిష్కరణ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని మూడో మండలం బ్రాడీపేట 4/14 ప్రాంతంలో 'మన ఊరు-మన జెండా' కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పావని రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిదా రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ మల్లీశ్వరి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. రాధా మాధవి బీజేపీ జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా నిషిదా రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, మండలంలో బీజేపీ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి జెండా స్థంభానికి డిజిటల్ జియో ట్యాగ్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి అవసరాలు, పార్టీ నాయకుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ విధానం ద్వారా ప్రజలకు సమాచారాన్ని సులభంగా చేరవేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.
కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, మాజీ కార్పొరేటర్ పాటిబండ్ల ఉషారాణి, జాతీయ స్పైసెస్ సంస్థ డైరెక్టర్ కేవీ సుబ్బారావు, మిర్చి యార్డు డైరెక్టర్ శ్రావణ కుమారి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, ఈమని మాధవరెడ్డి, ఉయ్యాల శ్యాంప్రసాద్, సాయి రాధాకృష్ణ, కావేరి మధు, దుర్గ, బొల్లాప్రగడ శ్రీదేవి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వర్రె లలిత, పాలడుగు సుభాషిణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రోహిణి, సుష్మారెడ్డి, జిల్లా నాయకులు డా. స్రవంతి, రాధిక, స్వాతి, కాసు శ్రీదేవి, శిరీష, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ, వి. విమలాదేవి, కోలా రేణుకాదేవి, కె. నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోధనాసుపత్రుల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.51 కోట్లు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):బోధనాసుపత్రుల్లో చిన్న చిన్న మరమ్మతు పనులు చేపట్టేందుకు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.51 కోట్ల వరకు ప్రభుత్వం వ్యయం చేయబోతుంది. 13 సర్వజన ఆసుపత్రులు (జీజీహెచ్ లు), 13 మెడికల్, డెంటల్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనుల కోసం మొత్తమ్మీద రూ.34.07 కోట్లు, రూ.16.92 కోట్లు చొప్పున అవసరమవుతాయని సదరు సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్ల నుంచి వచ్చిన విజ్ఞప్తుల ప్రకారం డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను



ఆదేశించారు. ఈ అంశంపై ఆర్థిక శాఖతో అధికారులు చర్చించారు. దీంతో సదరు బోధనాసుపత్రుల డెవలప్ మెంట్ ఫండ్స్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యా సేవ ట్రస్టు నిధుల నుంచి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేబట్టేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా డీఎంఈ డాక్టర్ ఎ. విష్ణువరన్ ఉత్తర్వులిచ్చారు.
కేజీహెచ్ లో రూ.8.77 కోట్లు, శ్రీకాకుళం జీజీహెచ్ లో రూ.5.29 కోట్లతో: అత్యధికంగా కేజీహెచ్ లో రూ.8.77 కోట్లతో, శ్రీకాకుళం జీజీహెచ్ లో రూ. 5.20 కోట్లతో, కాకినాడ జీజీహెచ్ లో రూ.2.94 కోట్లు, విజయవాడ జీజీహెచ్ రూ.4.10 కోట్లతో సౌకర్యాలను మెరుగుపరచనున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జీజీహెచ్ లో సూపర్ స్పెషాల్టీ, మెడికల్ వార్డుల అవసరాలకు తగ్గట్లు మెడికల్ గ్యాస్ పైపులైను, క్యాంటీన్ బిల్డింగ్ దగ్గర ఆర్సీసీ ర్యాంప్, వాటర్, మురుగు నీరు పైపుల మరమ్మతులు చేపట్టనున్నారు. కేజీహెచ్ లో రూఫ్ లీకేజీ మరమ్మతులు, కాకినాడ జీజీహెచ్ సర్జికల్ వార్డు మరుగుదొడ్లకు మరమ్మతులు చేయనున్నారు. అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో రూ. 1.35 కోట్లతో అత్యవసరంగా అవసరమైనచోట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. నీటి పంపిణీకి సంబంధించిన పైపులైన్లను మరమ్మతు చేయనున్నారు. విద్యుత్తు సరఫరా మెరుగుకోసం అవసరమైన మరమ్మతు పనులను చేబట్టనున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో అభివృద్ధి పనుల కోసం రూ. 1.11 కోట్లు, విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాలలో రూ.1.28 కోట్లు, కాకినాడ వైద్య కళాశాలలో రూ.3.68 కోట్లు చొప్పున వ్యయం చేయనున్నారు.

# 177 మంది ప్రతిభావంతులకు 'షైనింగ్ స్టార్స్-2026' సత్కారం

○ ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్-2026' కార్యక్రమం సోమవారం పొన్నూరు రోడ్డులోని బి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 137 మంది పదో తరగతి, 40 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలిపి మొత్తం 177 మందిని సత్కరించారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందజేయగా, మొత్తం రూ.35.40 లక్షలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ జిల్లాకు ఆదర్శంగా నిలిచారని, వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టేలా జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, డా. బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి మాట్లాడుతూ విద్యార్థులు మార్కులతో పాటు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విజ్ఞాన సమాజ నిర్మాణానికి విద్య కీలకమని, అవకాశాలను అందిపుచ్చుకుని సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని పేర్కొన్నారు.
ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన జిల్లా టాపర్లను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ ప్రోత్సాహక కార్యక్రమాలు చదువుకు ఎంతో తోడ్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జె. పద్మ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా విvిఐటియు జగన్నాథ రథయాత్ర

○ విద్యార్థులు, భక్తులతో ఆధ్యాత్మిక శోభ.. గోళ్లమూడి మీదుగా యూనివర్సిటీ వరకు రథోత్సవం





గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): విశ్వప్రఖ్యాత పూరీ జగన్నాథుని రథయాత్రకు సంఘీభావంగా వివిఐటి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిఐటియు జగన్నాథ రథయాత్ర భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది.
పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి గోళ్లమూడి గ్రామం మీదుగా వివిఐటి విశ్వవిద్యాలయం వరకు సాగిన రథయాత్రను వివా, వివిఐటి సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు సంప్రదాయ చేరాపహరా క్రతువును నిర్వహించి ప్రారంభించారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు కొలువుదీరిన రథాన్ని బంగారు చీపురుతో శుభ్రపరచడం ద్వారా రథయాత్రకు శ్రీకారం చుట్టారు.
వేలాది మంది భక్తులు, విద్యార్థులు, ఇస్కాన్ సభ్యులు పాల్గొనగా, విదేశీ భక్తుల సంకీర్తనలు, "జయ జయహే జై జగన్నాథ" నినాదాలతో యాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మార్గమధ్యంలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు, భక్తి గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిఐటియు అధ్యాపకేతర సిబ్బంది సభ్యుడు నంబూరు మణికుమార్ జగన్నాథుని వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నాడు.
గోళ్లమూడి గ్రామంలో స్థానికులు పూల వర్షం కురిపించి, హారతులతో రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వివిఐటి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇస్కాన్ మంగళగిరి ప్రతినిధులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, మహాహారతి నిర్వహించారు. అనంతరం భక్తులు, విద్యార్థులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి రథయాత్రను విజయవంతంగా ముగించారు.
ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం ఈవో గోగినేని లీలాకుమార్, వివా, వివిఐటి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ మంగళగిరి ప్రతినిధులు, పెదకాకాని పోలీసు సిబ్బంది, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

## జామియా మసీదు కమిటీ వివాదం పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ ఆలపాటి



○ మాజీ మంత్రిని కలిసిన ముస్లిం పెద్దలు.. నెల రోజుల్లో చర్యలకు హామీ

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): తెనాలి పట్టణంలోని చెంచుపేట జామియా మసీదు కమిటీ నియామక వివాదం నేపథ్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల సందర్భంగా ముస్లిం పెద్దలు, మత పెద్దలు సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిశారు.
తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖుద్దూస్ దీక్ష శిబిరాన్ని సందర్శించి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున చర్చలకు ఆహ్వానించడంతో ముస్లిం పెద్దలు తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్లి సమస్యను వివరించారు.
ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జామియా మసీదు కమిటీ నియామకానికి సంబంధించిన వివాదం గురించి ఇంతవరకు తనకు పూర్తి సమాచారం లేదని, ఇటీవల మీడియా ద్వారా విషయం తెలుసుకున్నానని తెలిపారు.
సమస్యకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను తెలుసుకుని సానుకూలంగా స్పందిస్తానని చెప్పారు. ముస్లిం పెద్దల అభిప్రాయాలను పూర్తిగా విన్న అనంతరం వారికి అవసరమైన కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాట్లాడి నెల రోజుల వ్యవధిలో కమిటీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆలపాటి హామీ ఇచ్చినట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఆయన ఇచ్చిన హామీని విశ్వసించి ప్రస్తుతం కొనసాగుతున్న ఆందోళనను విరమించినట్లు పేర్కొన్నారు. అయితే నెల రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా కమిటీ ఏర్పాటు కాకపోతే మళ్లీ రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.
రిలే నిరాహార దీక్షకు పట్టణంలోని వివిధ మసీదుల ముతవల్లీలు, ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు సంఘీభావం ప్రకటించారు.
షేక్ హబీబుల్ రహమాన్, షేక్ నసీం, సయ్యద్ జహీరుద్దీన్, సయ్యద్ ఖాసిం, షర్ఫుతుల్లా, ఏఎస్ఐ సత్తార్, పెచ్చింగ్ సుభాని, చాన్ బాషా, క్లాసిక్ అబ్దుల్లా, నూర్, షేక్ గౌస్, కుతుబుద్దీన్, మహమ్మద్ జాకీర్, ఇమామ్-ఎ-మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్, అర్షద్ మహ్మద్‌తో పాటు పలువురు ముస్లిం పెద్దలు, నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి సమస్యను వివరించారు.
కార్యక్రమంలో పట్టణానికి చెందిన మసీదుల ముతవల్లీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు.

# నేటి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంపై ఉద్యోగుల ఆశలు

○ ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు ప్రకటిస్తుందనే విశ్వాసం: ఏపీ జేఏసీ అమరావతి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం జరగనున్న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆశతో ఎదురుచూస్తున్నారని ఏపీ జేఏసీ అమరావతి పేర్కొంది. ప్రధానంగా ఆర్థిక అంశాలతో పాటు ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించి ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు ప్రకటిస్తుందనే నమ్మకం ఉందని తెలిపింది.
గత ప్రభుత్వం హయాం నుంచి పేరుకుపోయిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారని పేర్కొంది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించకపోవడంతో జూన్ 7న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఉద్యమ సన్నద్ధత కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించింది.
ఈ నెల 10, 11 తేదీల్లో ఆర్థిక, రెవెన్యూ, సమాచార-ప్రజాసంబంధాల శాఖల మంత్రి ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో 22 ప్రధాన డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపింది. ఉద్యోగసంఘాల ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి హామీ ఇచ్చారని, జులై 21న లేదా అంతకుముందే అన్ని ఉద్యోగసంఘాలతో సమావేశం నిర్వహించి పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారని గుర్తుచేసింది.
ప్రభుత్వం ఇచ్చిన హామీని గౌరవిస్తూ జులై 12న శ్రీకాకుళంలో, 21న అనంతపురంలో నిర్వహించాల్సిన ఉద్యమ సన్నద్ధత సభలను వాయిదా వేసినట్లు ఏపీ జేఏసీ అమరావతి తెలిపింది.
ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వంతో జరగబోయే సానుకూల చర్చలకు విఘాతం కలుగుతుందని మంత్రి సూచించిన నేపథ్యంలో ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.
ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతుందనే విశ్వాసం తమకు ఉందని పేర్కొంది. ప్రస్తుత పరిణామాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 25న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది.
ఈ వివరాలను ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు వెల్లడించారు.

# ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భాగస్వామ్యం కల్పించాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, దాని ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ఎనిమిది ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు 4,196.55 ఎకరాల భూమిని కేటాయించడం, రూ.1,720.88 కోట్ల పెట్టుబడులతో 1.72 లక్షలకుపైగా ఉపాధి అవకాశాలు కల్పించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న భూములు ప్రజల ఆస్తి కాబట్టి, వాటిపై ఏర్పడే పరిశ్రమల ద్వారా కలిగే ప్రయోజనాలు కూడా అన్ని వర్గాలకు సమానంగా అందేలా ప్రత్యేక విధానాలు రూపొందించాలని పీవీఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు పారిశ్రామిక యాజమాన్యం, పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూలధనం, బ్యాంకు రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం, భూమి, మార్కెట్ అవకాశాల కొరత కారణంగా ఈ వర్గాలు వెనుకబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు పొందిన ప్రతి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు, షెడ్లు కేటాయించే ప్రత్యేక విధానం రూపొందించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ రాయితీలు పొందే పార్కులు సామాజిక భాగస్వామ్య లక్ష్యాలు సాధించినప్పుడే పూర్తి ప్రోత్సాహకాలు అందేలా ఒప్పందాల్లో నిబంధనలు చేర్చాలని సూచించింది. అలాగే కేంద్ర ప్రభుత్వ స్టాండ్-అప్ ఇండియా, పీఎంఈజీపీ, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, ఫైనాన్స్ కార్పొరేషన్ల పథకాలతో అనుసంధానం చేయాలని కోరింది. పెద్ద పరిశ్రమలు తమ సరఫరా వ్యవస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ యాజమాన్యంలోని ఎంఎస్ఎంఈ యూనిట్లకు అవకాశాలు కల్పించాలని, స్థానిక పారిశ్రామికవేత్తలతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేస్తే అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల్లో ప్రాధాన్యం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక అవకాశాలు, భూమి ధరల్లో రాయితీలు, మూలధన, వడ్డీ సబ్సిడీలు, విద్యుత్ రాయితీలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, బ్యాంకు రుణాలకు ప్రభుత్వ హామీ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరింది.
ప్రతి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో సామాజిక భాగస్వామ్యంపై వార్షిక సామాజిక ఆడిట్ నిర్వహించి, ప్లాట్ల కేటాయింపులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల వివరాలను ప్రజలకు వెల్లడించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ విధానాల అమలును పర్యవేక్షించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరింది. ప్రభుత్వ భూములు, ప్రజా వనరులతో అభివృద్ధి చెందే పరిశ్రమల ఫలితాలు అన్ని వర్గాలకు చేరినప్పుడే నిజమైన సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467